TGTEL/25/A4111

# మంచితనం

జర్నలిస్ట్ MANCHITANAM JOURNALIST DAILY దినపత్రిక

manchithanamjournalist.online

శనివారం, ఆగస్టు 01 2026 , సంపుటి : 03 సంచిక : 16 - పేజీలు - 8 వెల : 5 రూ/..




### అడ్వాన్స్?డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్

# టెక్నాలజీ కోర్సులు

## నైపుణ్యాభివృద్ధిశక్తి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ కంపెనీల్లో ఉద్యోగాల వరకు టామ్‌కామ్ బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవెలియన్‌లో స్కిల్స్, క్యాపిటల్, నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇనీషియేటివ్ శాఖ(శక్తి) కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలి : ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు.దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.స్కిల్ వర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి : యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైనటువంటి రీసెర్చ్ సెంటంను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సి టీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని ఆయన సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్?షిప్?లు ఇచ్చినట్లుగానే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందే వారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఏటీసీల్లో(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల)లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని ఆయన సూచించారు.

### అందుబాటులోకి ఫ్యామిలీ

# సర్టిఫికెట్ సేవ



**హైదరాబాద్, జులై 31:**
తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇకపై కుటుంబ సభ్యుల సమాచారం.. వారి పూర్తి వివరాలతో కూడిన ఫ్యామిలీ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా పొందవచ్చని తెలిపారు. కుటుంబ వివరాలను అధికారికంగా ధ్రువీకరించుకునేందుకు ఈ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సమాచారానికి సంబంధించి అవసరమైన సందర్భాల్లో ఈ ధ్రువపత్రాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ అన్ని చోట్ల చెల్లుబాటు అవుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, వివిధ అధికారిక అవసరాలు, కుటుంబ వివరాలను సమర్పించాల్సిన సందర్భాల్లో ఈ ధ్రువపత్రం కీలకంగా మారనుందని తెలిపారు. ఇప్పటివరకు కుటుంబ వివరాల ధ్రువీకరణ కోసం ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

## ఆగస్టు చివరలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు శ్రీకారం



**హైదరాబాద్, జులై 31:**
ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ (జఖ=జు)లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు.ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. ఖా× లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు.లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.

### ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో

## తగ్గనున్న వర్షాలు



రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్? వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది.
వర్షపాతం అంచనాఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్?లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్?పీఏ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు-సెప్టెంబర్? కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్?పీఏ) 422.8 మి.మీ.గా ఉంది.

### అశ్రునయనాల మధ్య పూర్తయిన

# 'పెద్ది' అంత్యక్రియలు

◆భారీగా తరలివచ్చిన అభిమానులు



**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామం నల్లబెల్లిలో అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 'పెద్ది'ని కడసారి చూసేందుకు అభిమానులు, స్థానికులు భారీగా తరలివచ్చారు. దీంతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. బాధాతప్త హృదయాలతో ఆయనకు వీడ్కోలు పలికారు.అంతకు ముందు..వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని నివాసానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్థీవదేహాన్ని తీసుకొచ్చారు. మంత్రి సీతక్క, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పెద్ది సుదర్శన్‌రెడ్డికి నివాళులు అర్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు తుది శ్వాస విడిచినట్లు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. పెద్ది మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.ఐదురోజులు మృత్యువుతో పోరాడి : 'పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు' అనే వార్త బీఆర్?ఎస్? శ్రేణుల గుండె బరువెక్కిస్తుంది. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానికంగా రోహిణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. 5 రోజులు మృత్యువుతో పోరాడిన పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం కన్నుమూశారు. పెద్ది మరణంతో ఆయన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ సహా పలువురు బీఆర్?ఎస్ నేతలు ఆస్పత్రికి చేరుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. పెద్ది భౌతిక కాయాన్ని హనుమకొండకు తరలించారు. సుదర్శన్? రెడ్డికి భార్య స్వప్న, పిల్లలు నిదర్శన్? రెడ్డి, ధర్మిష్ట ఉన్నారు.

### ' సరికొత్త శిఖరాలకు భారత్- యూకే వ్యూహాత్మక

# భాగస్వామ్యం



**న్యూ ఢిల్లీ :**భారత్, బ్రిటన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్?లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఇటీవల అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే వాణిజ్య, పెట్టుబడి అవకాశాలను సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని ఇరువురు నేతలు నిశ్చయించారు. భారత్- యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు ఇరు దేశాల ప్రధానులు అంగీకరించారు. ఇందులో భాగంగా పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించారుబ్రిటన్ మరోవైపు బ్రిటన్ నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హామ్‌కు ప్రధాని మోదీ మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన పదవీకాలం విజయవంతం కావాలని మోదీ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధానమంత్రి మోదీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. బ్రిటన్ ప్రధానితో మాట్లాడటం చాలా ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

### రాష్ట్రానికి డీఏపీ ఎరువుల


# సరఫరా పెంచండి



**హైదరాబాద్, జులై 31:**
రాష్ట్రానికి డీఏపీ ఎరువుల సరఫరాను పెంచాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో రైతులకు డీఏపీ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన్ని మంత్రి తుమ్మల కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. ఆగస్టుకు 50 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ కేటాయించాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో మరో 50 వేల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరారు.రాష్ట్రంలో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని ఆ లేఖలో మంత్రి తుమ్మల వివరించారు. డీఏపీ ఎరువుల డిమాండ్ భారీగా పెరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో డీఏపీ ఎరువుల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా సహకరించాలని కేంద్రానికి ఈ సందర్భంగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

### తెలంగాణలో 'సర్' గడువు

# పొడిగింపు.




**హైదరాబాద్ :**తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును మరోసారి పొడిగించినట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ను కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని స్పష్టం చేశారు. ఆగస్టు 10వ తేదీ వరకు ఎన్యూమరేషన్ దరఖాస్తులు తిరిగి ఇవ్వవచ్చని తెలిపారు.సవరించిన 'సర్' షెడ్యూల్ఎన్యూమరేషన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 10-08-202పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్య వస్థీకరణ: 10-08-2026 ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ: 17-08-2026క్లెయి మ్‌లు, అభ్యంతరాల స్వీకరణ: 17-08-2026 నుంచి 16-09-2026 వరకుక్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం (నోటీసు కాలం): 17-08-2026 నుంచి 15-10-2026 వరకుతుది ఓటరు జాబితాల ప్రచురణ: 19-10-2026

శనివారం,
ఆగస్టు 01 2026
మంచితనం జర్నలిస్ట్ దినపత్రిక
MANCHITANAM JOURNALIST DAILY
TGTEL/25/A4111



# దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఘన నివాళి



**మంచితనం జర్నలిస్ట్, శామీర్ పేట్ :** దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమకారుడు ఆకస్మికంగా మరణించడం బిఆర్ఎస్ కి తీరనిలోటని శామీర్ పేట్ బిఆర్ఎస్ నేతలు అన్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండె పోటుతో మరణించడంతో శుక్రవారం శామీర్ పేట చౌరస్తా వై ఎస్ ఆర్ విగ్రహంవద్ద అయన చిత్ర పటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమకారుడు ఆకస్మికంగా మరణించడం చాలా బాధాకరమని పార్టీకి తీరనిలోటని బిఆర్ ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు ఐలయ్య యాదవ్, బాబు, భూమిరెడ్డి, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, వేంకటేష్, పవన్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి: భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్

**పటాన్‌చెరు, జూలై 31:**
రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నిలిచిపోయిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో పటాన్‌చెరు అసెంబ్లీ పరిధిలో సమరభేరి మోగించారు. భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ పిలుపు మేరకు, సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ అధ్యక్షులు బోర్ర ప్రవీణ్ యాదవ్ సూచనలతో బీరంగూడ ప్రాంతంలో విస్తృత నిరసన మరియు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అన్న అకాడమీ కాలేజ్, గరుడ కాలేజ్ మరియు విజన్ ఒకేషనల్ కాల?జీలను సందర్శించారు.




రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రతి విద్యార్థి నుండి సంతకాలు సేకరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోందని, వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా డిమాండ్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

**- రేషన్ కార్డుల ఈకేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు**



**మెదక్, జూలై 31**
మెదక్ జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్--2026 నెలలకు సంబంధించిన మూడు నెలల బియ్యం కోటాను ఆగస్టు 1 నుంచి తమ సమీప ఫెయిర్ ప్రైస్ షాపుల (ఎఫ్ సి ఎస్) ద్వారా ఒకేసారి పొందాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద తెలిపారు. అలాగే రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి ఆగస్టు 31లోపు ఈ కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయించాలని సూచించారు. చిన్నారుల ఈ కేవైసీ ను ఐరిస్ డివైస్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ఎఫ్ పి ఎస్ డీలర్లు నిర్ణీత సమయానికి దుకాణాలు తెరిచి మూడు నెలల బియ్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని, ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్న ప్రతి లబ్ధిదారునికి సమాచారం అందించి 100 శాతం ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో మైక్ అనౌన్స్‌మెంట్‌ల ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ, ఈకేవైసీవ పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, బియ్యం పంపిణీతో పాటు ఈ కేవైసీ ప్రక్రియను సమాంతరంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# వృద్ధురాలి హత్య కేసులో దంపతులకు జీవిత ఖైదు

**రూ.14వేల జరిమానా విధింపు -- దర్యాప్తు అధికారులను అభినందించినఎస్పీ**




**మెదక్ టుడే జులై 31:**
వృద్ధురాలిని హత్య చేసి రూ.4 లక్షల నగదును అపహరించిన కేసులో నిందితులైన బి. కీరాజీ (36), జక్కుల చంద్రకళ (34)లకు మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.14 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.
జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం, 2020 అక్టోబర్ 11న ఆర్థిక ఇబ్బందుల కారణంగా చంద్రకళ తల్లి రాధను హత్య చేసి ఆమె వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును నిందితులుఅపహరించారు. దర్యాప్తులో నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ జీవిత ఖైదు శిక్ష విధించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. వెంకటేశ్, కోర్టు లైజనింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది కృషిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు

# ఆరోగ్యమే మహాభాగ్యం : అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**కేశవరం జెడ్పీహెచ్ఎస్‌లో డెంటల్, మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభం**




**మంచితనం జర్నలిస్ట్, శామీర్ పేట్ :**
ఆరోగ్యమే మహాభాగ్యమని విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు, అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందూస్తాన్ భారత్ లిమిటెడ్ ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డెంటల్, మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్‌ను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ లతో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించే అవకాశం కలుగుతుందన్నారు. క్యాంప్‌లో విద్యార్థులకు డెంటల్, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, స్థానిక కౌన్సిలర్ బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, కొంపల్లి మాధవి భూమేష్ గౌడ్, ఎంఈవో భాగ్యమణి, ఉపాధ్యాయులు సుబ్బారావు, వైద్య బృందం, రోహిణి ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, పట్టణాభివృద్ధి లక్ష్యం : చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి

**అలియాబాద్ పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశం**




**మంచితనం జర్నలిస్ట్, శామీర్ పేట్ :**
ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజా సంక్షేమం, పట్టణాభివృద్ధికి పాలకవర్గంతో కలసి పనిచేస్తున్నట్లు చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో పురపాలక సంఘ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల మరమ్మతులు, పార్కులు, హరిత ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం విజయవంతానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 10 శాతం గ్రీన్ బడ్జెట్ కేటాయింపులపై చర్చించి, పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని ఆమోదించింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి అలియాబాద్ పురపాలక సంఘాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 42 ఏళ్ల సేవకు ఘన నివాళి





**మంచితనం జర్నలిస్ట్ ఖమ్మం:**
విధులకు వీడ్కోలు పలికిన సయ్యద్ అమీర్ అలీ ప్రజాసేవనే పరమావధిగా భావించి 42 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, ధైర్యసాహసాలతో సేవలందించిన సయ్యద్ అమీర్ అలీ అధికారికంగా పదవీ విరమణ పొందారు.
సేవా కాలమంతా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన ఆయన తన విధులను అంకితభావంతో నిర్వహించి సహచరుల ప్రశంసలు, ప్రజల అభిమానాన్ని పొందారు. క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన ఆయన పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.
విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు సేవా పతకాలు, ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులు అందుకుని తన సేవలను మరింత గౌరవప్రదంగా నిలిపారు.
ఈ సందర్భంగా సహచర అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు సయ్యద్ అమీర్ అలీకి ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఆయన సేవలను కొనియాడారు.
"ఒక యూనిఫాం ఈ రోజు విశ్రాంతి తీసుకుంటోంది... కానీ ఆ యూనిఫాంలో నిలిచిన నిజాయితీ, ధైర్యం, కర్తవ్యనిష్ఠ, ప్రజాసేవ చరిత్రగా చిరకాలం నిలిచిపోతాయి. 42 ఏళ్ల అంకిత జీవితానికి హృదయపూర్వక సెల్యూట్" అంటూ పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలు కలగాలని అందరూ కోరుకున్నారు.
పాల్గొన్నవారు
ధర్మపత్ని: సలీమా సయ్యద్
కుమారుడు: సయ్యద్ టిప్పు సుల్తాన్
కుమార్తెలు:
సయ్యద్ రాజియా సుల్తానా
హుమేరా మొహమ్మద్
అల్లుళ్లు:
సయ్యద్ అహ్మద్ బాషా
మొహమ్మద్ అబ్దుల్ ఘనీ
కోడలు:
తాహిరా సుల్తాన్
మనవలు -- మనవరాళ్లు:
రుమైజా ఫాతిమా
అబ్దుల్ ముకీత్
ఉజైర్ అహ్మద్
ఎరమ్ ఘనీ
ఒమర్ ఫర్హాన్
అర్యా ఫాతిమా

TGTEL/25/A4111
జర్నలిస్ట్ MANCHITANAM JOURNALIST DAILY దినపత్రిక

# సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ పేరు
## మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



,**హైదరాబాద్:** సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌కి దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ స్థానంలో మర్రి చెన్నారెడ్డి పేరు మారుస్తూ ప్రభుత్వం తీసుకుంది. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స్' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్ నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్‌స్పెషాలిటీ దవా ఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పరు గులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమ యానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవా ఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను నిలిపివేసింది. అడ్డగోలు ఆరోపణలు చేస్తూ కాలం గడిపింది.

అయితే బీఆర్ఎస్‌తోపాటు ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడితో తిరిగి పనులను పట్టా లెక్కించింది.

గత సంవత్సరమే మూడు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబా టులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్ నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

# కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
## 8.35 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం



**కాళేశ్వరం:** ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9:00 గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్ద గోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ప్రాంతంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమోదైంది. బ్యారేజ్ వద్ద మొత్తం 8,35,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోగా కొనసాగుతుండగా, వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయి 12.210 మీటర్లు, ప్రమాదస్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికా రులు సూచించారు.

# ఆగస్టు చివరలో ఇందిరమ్మ టవర్స్
## నిర్మాణాలకు శ్రీకారం మంత్రి పొంగులేటి



**హైదరాబాద్:** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇం దిరమ్మ టవర్స్ టెండర్ ప్రక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. ఖా× లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్ధిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు.

ఫలక్‌నుమా ప్యాలెస్ సమీప ంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడ తామని పేర్కొన్నారు.

పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పి ంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొం గులేటి తెలిపారు.

# తెలంగాణ సర్‌ను
## పరిశీలించిన నవీన్ కుమార్



**తెలంగాణ:** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ ప్రక్రియను సమీక్షి ంచేం దుకు ఆయన రాష్ట్రా నికి వచ్చారు. అంత కుము ందు ఆయ నకు తెలంగాణ చీఫ్ ఎలక్టో రల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమి షనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు మాట్లాడారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో
## కన్నీళ్లు పెట్టుకున్న హరీశ్ రావు



**వరంగల్ :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమ యాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు కన్నీళ్లుపెట్టుకున్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసు కొని భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంత మయ్యారు. కాగా, సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కో లు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సం పేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జన ం పోటెత్తడంతో పట్టణమంతా జనసం ద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సంద ర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసి పోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.

# మార్కెట్‌లో నకిలీ ఎరువులు విక్రయాలు
## రైతులకు వ్యవసాయ శాఖ బిగ్ అలర్ట్




**హైదరాబాద్:** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లోని రైతులు.. నకిలీ ఎరువులు కొనుగోలు చేసి.. ఇబ్బంది పడుతున్నట్లు వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ వెంటనే అప్రమత్తమైంది. దాంతో రైతులకు కీలక సూచనలు చేసింది. నకిలీ డీఏపీ ఎరువులు కొనుగోలు చేయవద్దని రైతులకు స్పష్టం చేసింది. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనాలని సూచించింది. ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత.. బిల్లు తప్పనిసరిగా తీసుకుని భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేసింది. తక్కువ ధర పేరుతో ఎరువులు కొని మోసపోవద్దని రైతులకు తెలంగాణ వ్యవసాయ శాఖ వివరి ంచింది. రహదారి పక్కన, లారీల్లో విక్రయించే ఎరువులు కొనవద్దని రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే ఎరువుల సంచిపై తయారీ, గడవు తేదీలతోపాటు ఎంఆర్‌పీ (వీ¬రా) వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని రైతులను కోరింది. అనుమానాస్పద ఎరువుల బస్తాలను గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించింది. తక్కువ ధర పేరుతో మోసాలకు గురికావద్దని రైతులను హెచ్చరించింది. జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. నకిలీ ఎరువుల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. అప్రమత్తతే రైతుల పెట్టుబడికి రక్షణ అని స్పష్టం చేసింది.

ఈ మేరకు వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే రాష్ట్రంలో ని ఐదు జిల్లాల(రంగారెడ్డి, సూర్యాపేట, కరీం నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్)లో నకిలీ ఎరువుల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో నకిలీ ఎరువుల విక్రేతలపై కేసులు నమోదు చేశారు. అలాగే నిందితు లను అరెస్ట్ చేశారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంస్థ
## రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్



**హైదరాబాద్:** రెవెన్యూ శాక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంస్థ రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎన్‌హెచ్ఆ సీరియస్ అయింది. రాజేం ద్రనగర్‌లోని మానస హిల్స్ అక్రమ మైనింగ్ విషయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంస్థపై జాతీయ మాన వ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అనుమతులు లేకుండా అన్ని తవ్వ కాలు ఎలా చేశారు సామాన్య ప్రజలకు ఓ చట్టం, మంత్రి సంస్థలకు ఓ చట్టం ఉం టుందా అని సూటి గా ప్రశ్నించింది. దీనిపై ఎంఎండీఆర్ చట్టం కిందచర్యలు తీసు కోవాలని కేంద్ర ప్రభు త్వానికి సూచింది. రెవెన్యూ, గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మం డలి, హెచ్ఎండీఏ ఎందుకు మౌనంగా ఉన్నాయి 8 వారాల్లో చర్యలు తీసుకోవా లని కేంద్ర బొగ్గు గనుల శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

# నర్సంపేటకు చేరుకున్న పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం



**నర్సంపేట:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం నర్సంపేటకు చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసి పలువురు భావోద్వేగానికి గురయ్యారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటల తర్వాత తుదిశ్వాస విడిచారు. జూలై 26వ తేదీన ఉదయం హనుమకొండలోని తన నివాసంతో పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో తొలుత స్థానిక ఆస్పత్రికి, ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలి ంచారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించి నప్పటికీ ఆయన్ను కాపాడలేకపోయారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. వరంగల్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాధనకు అండగా నిలిచిన ఆదర్శ నాయకుడైన సుదర్శన్ రెడ్డి, 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. ఆయన 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) తరఫున జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) సభ్యు డిగా ఎన్నికయ్యారు. ఆయన 2004లో టీఆర్ ఎస్ జిల్లా పార్టీ కన్వీనర్‌గా ఎన్నికై, ఆ తర్వాత 2002లో రాష్ట్ర పార్టీ కన్వీనర్‌గా నామినేట్ అయ్యారు. ఆయన ఎనిమిదేళ్లకు పైగా టీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, ఆ తర్వాత పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నామినేట్ అయ్యారు.

# ఉజ్జయిని మహంకాళి బోనాలు ఆగస్టు 2
## నుంచి 4 వరకు సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఆగస్టు 2 నుంచి 4 వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా మహంకాళి ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. పొగాకు బజార్, సుభాష్ రోడ్, హిల్ స్ట్రీట్ రహదారులను తాత్కాలికంగా మూసివేయనుండగా, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయం వైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, ఘాస్‌మండి, బైబిల్ హౌస్, కర్బాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు.

**14 పార్కింగ్ కేంద్రాలు..**

భక్తుల సౌకర్యార్థం హరిహర కళాభవన్, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ మాల్, వెస్లీ కాలేజ్, జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్‌తో పాటు మొత్తం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్యాట్నీ నుంచి ట్యాంక్‌బండ్ వెళ్లే వాహనాలను ప్యారడైజ్, క్లాక్ టవర్ మీదుగా మళ్లించనుండగా, ప్యారడైజ్ నుంచి ఎంజీ రోడ్ వెళ్లే వాహనాలను సింధీ కాలనీ మీదుగా డైవర్ట్ చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్సులకు కూడా ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకుని, ట్రాఫిక్ పోలీసుల సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని అధికారులు సూచించారు.

మంచితనం
MANCHITANAM JOURNALIST DAILY
దినపత్రిక
TGTEL/25/A4111

# గోదావరి ఉధృతి పెరుగుతోంది

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి కోనసీమ కలెక్టర్



**కోనసీమ:** గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. నేటి(శుక్రవారం) రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. సుమారు 10 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే, రేపు సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 13 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల ఉండొచ్చని అంచనా వేశారు.జిల్లాలోని 19 మండలాలపై వరద ప్రభావం ఉందని కలెక్టర్ వెల్లడించారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని 16 - 17 మండలాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 32 లంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, సహాయక బృందాలు సిద్ధంగా ఉన్నాయని, వరద ప్రభావం నేపథ్యంలో జిల్లా అధికారుల సెలవులను మూడు, నాలుగు రోజుల పాటు రద్దు చేసినట్లు తెలిపారు. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతున్నందున గోదావరిలోకి ఎవరూ దిగవద్దని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పడవ ప్రయాణాలపై తాత్కాలిక ఆంక్షలు విధించామని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్‌మహేష్ కుమార్ పేర్కొన్నారు.

# అభివృద్ధిని చూసి జగన్

## ఓర్చుకోలేకపోతున్నారు పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరోసారి విరుచుకుపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రాకు మణిహారమని గుర్తు పెట్టుకో జగన్ అని అన్నారు. భోగాపురం అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ఆటంకం కలిగించేందుకే విశాఖకు జగన్ వచ్చారని ఆరోపించారు.కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా అన్నారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి125, జిల్లా మొత్తం 5000 వేల బస్సుల్లో 5 లక్షల మంది ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా వ్యాపారస్థులు ఉత్తరాంధ్రకు రావడం అలాగే పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర..

స్వర్ణాంధ్ర బాటలో వెళ్లి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందన్నారు.

ఇకపై ఉద్యో గరీత్యా. వ్యాపారరీత్యా ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఆగుతాయని పల్లా శ్రీనివాసరావు పేర్కొ న్నారు.

# ఏపీ ఓటరు జాబితా ముసాయిదా విడుదల

## 89.22 శాతం మంది ఫారాలు సమర్పించారు సీఈవో




**అమరావతి:** రాష్ట్రంలో 3.71 కోట్ల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని ఏపీ ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈవో వివేక్ యాదవ్ మాట్లాడారు. ఈ ముసాయిదా జాబితాను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నెట్ యాప్, సీఈవో వెబ్‌సైట్‌లలో పరిశీలించ వచ్చునని ఓటర్లకు ఆయన సూచించారు.మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని.. వారిలో 89.22% మంది ఫారాలు సమర్పించారని ఆయన తెలిపారు. అయితే 15.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు గుర్తించామని వివరించారు. 22.30 లక్షల మంది శాశ్వత చిరునామా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు కనుగొన్నామని చెప్పారు. 7.37 లక్షల మంది ఓటర్ల పేర్లు రెండు, మూడు చోట్ల నమోదయ్యాయని పేర్కొన్నారు.ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న వారి పేరు ఒకే చోట కొనసాగేలా చర్య లు తీసుకున్నామని అన్నారు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయి మ్స్‌తోపాటు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.అక్టోబర్ 3వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని సీఈవో వివేక్ యా దవ్ స్పష్టం చేశారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించబోమని ఈ సందర్భంగా వెల్లడించారు. అర్హులెవరు మిస్ కాకుండా, అనర్హులు చేరకుండా పారదర్శక ప్రక్రియకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

# గోదావరి వరద ఉధృతి అప్రమత్తంగా

## ఉండాలని విపత్తుల సంస్థ హెచ్చరిక



**అమరావతి:** గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థవెల్లడించింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45.9 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యిందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2,36,870 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ధవళేశ్వరం వద్ద ఈరోజు రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని, రేపు ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు.గోదావరి పరీవాహక జిల్లాల్లో వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితుల నేపథ్యంలో నదిలో స్నానం చేయడం, చేపలు పట్టడం వంటి పనులకు వెళ్లవద్దని హెచ్చరించారు. అలాగే వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లపై ప్రయాణాలు చేయవద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు.

# అదుపుతప్పి డివైడర్‌ను

## ఢీకొన్న స్కూటీ ఒకరి మృతి




**విశాఖపట్నం:** నగరంలోని లంకెలపాలెం అగనంపూడి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. తెల్లవా రుజామున ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడిని సాయిగా గుర్తించారు.గాయపడిన బాలు అనే వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. వీరిద్దరూ అగనంపూడి గల్లవా నిపాలెం ప్రాంతానికి చెందినవారిగా పోలీ సులు తెలిపారు. ఈ ప్రమాదంపై దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలము కున్నాయి.

# ఏపీలో విపత్తు నిర్వహణ వ్యవస్థలపె

## కేంద్ర ఉన్నతాధికారుల సమీక్ష




**అమరావతి:** ఏపీలో విపత్తు నిర్వహణ వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఇవాళ ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయాన్ని ఎన్డీఎంఏ, ఎన్డీఆర్ఎఫ్ బృందం సందర్శించింది. విపత్తుల ముందస్తు సన్నద్ధత బలోపేతంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సమీక్షించారు. వడగాలులు, పిడుగుపాట్ల నివారణ కార్యాచరణపై ఏపీ అధికారులతో చర్చించారు.

ఎస్డీఆర్ఎఫ్ బెటాలియన్ల సామర్థ్య పెంపుపై కేంద్ర బృందం దృష్టిసారించినట్లు అధికారులు తెలిపారు. ఆధునిక పరికరాల సమీకరణ, అగ్నిమాపక సేవల విస్తరణపై సమీక్షించారు. ఏపీ, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికల నవీకరణపై ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు మాట్లాడారు. అలాగే, ఎన్‌డీఎంఐఎస్ పోర్టల్‌లో సమాచార నమోదు తీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఐడీఆర్ఎన్ పోర్టల్ వినియోగంపై కీలకంగా చర్చించారు.జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విపత్తు నిర్వహణ బలోపేతమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విపత్తు నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రజలకు వేగవంతమైన విపత్తు సేవలందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఏపీలో పర్యటించామని వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో సాంకేతికత వినియోగం పెంపుపై కార్యాచరణ చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

# పరామర్శ యాత్రగా కాకుండా బలప్రదర్శన

## యాత్రగా చేయడం విడ్డూరం మంత్రి నిమ్మల

**కాకినాడ:** ప్రపంచంలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడం చూశాంగానీ, హత్య చేసిన వ్యక్తిని పరామర్శించడం వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కే చెల్లిందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లాలోని అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇది పరామర్శ యాత్రగా కాకుండా, బలప్రదర్శన యాత్రగా మాజీ సీఎం జగన్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవ పండగ వాతావరణంలో ఉంటే.. వైఎస్ జగన్ ఓర్వలేనితనంతో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం నీరు పారించాలని చూస్తుంటే, గొడ్డలి పార్టీ రక్తాన్ని పారించాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు. దారిన పోయే దానయ్య చనిపోతే నష్టమేంటని వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని చెప్పారు. దానయ్యకు 45 ఏళ్ళు వచ్చాయి.. వయసైపోయిన వ్యక్తి చనిపోతే నష్టమేంటని ఆయన ప్రశ్నిస్తున్నారని అన్నారు. మరి 54 ఏళ్ళు వచ్చిన గొడ్డలి పార్టీ అధినేతకు కూడా వయసై పోయినట్లే కదా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఖాకీ డ్రెస్ అన్నా.. మహిళలన్నా గొడ్డలి పార్టీ నాయకుడికి గౌరవం లేదని విమర్శించారు. ఆడవాళ్ళ జోలికొస్తే అదే ఆఖరి రోజు అని సీఎం చంద్రబాబ వ్యాఖ్యలు.. గొడ్డలి పార్టీకి కూడా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చనిపోయిన వ్యక్తిని కాదని, చంపిన వ్యక్తిని పరామర్శించడం సరికాదని.. మాజీ మంత్రి బొత్స లాంటి వారు కూడా జగన్‌కు ఎందుకు చెప్పలేకపోయారంటూ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసిన వ్యక్తి.. హత్య చేసిన వ్యక్తిని ఓదార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఎర్ర బస్సు రాని ఊరికి, ఎయిర్ బస్ ఎందుకని నాడు జగన్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కోర్టులకు వెళ్లి మరీ భోగాపురం ఎయిర్ పోర్టు రాకుండా అడ్డుకుంటానని జగన్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.జగన్‌కున్న క్రెడిట్ చోరీ జబ్బును అందరికీ అంటించాలని చూస్తున్నాడని ఆరోపించారు. పోలవరం నుంచి 3 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరంకు ఎగువన నీటి నిల్వ కోసం, ఒక్క ప్రాజెక్టు కూడా లేకపోవడం చూసి సర్ ఆర్థర్ కాటన్ మనవరాలు ఆవేదన చెందారని చెప్పారు. నాడు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారని వివరించారు. 2019లో ప్రభుత్వం మారకుండా ఉండి ఉంటే, 2024 నాటికి పోలవరం పూర్తయి అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు గోదావరి జలాలు వెళ్లి ఉండేవని అన్నారు.

ఒక్క ఛాన్స్ అంటూ గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చి పోలవరాన్ని ధ్వంసం చేసి, డయాఫ్రం వాల్‌ను విధ్వంసం చేశారని మండిపడ్డారు. నాడు ఇరిగేషన్ మంత్రులు, సీఎం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమంటూ అసెంబ్లీలోనే చెప్పి, ఆ ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. లక్ష్యంగా పెట్టారని వివరించారు. తీసు కొచ్చారని పేర్కొన్నారు.

# మహిళా ఎస్ఐపై దాడి చేసిన

## వైసీపీ నేతలపై కేసులు నమోదు




**శ్రీకాకుళం:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనలు, పార్టీ నేతలు, కార్యకర్తల వ్యవహారశైలిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. జిల్లాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై పోలీసులు చర్యలు చేపట్టారు. మహిళా ఎస్ఐ ప్రవళిక విధి నిర్వహణలో ఉండగా ఆమెపై దాడి జరి గినట్లు నమోదైన ఘటనకు సంబంధించి ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జ్ చింతాడ రవికు మార్‌ను ఏ-1గా పేర్కొంటూ మొత్తం 21 మందిపై కేసులు నమోదు చేశారు.ఘటన సమయంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఫిర్యాదు, అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆధారాల మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటనలో పాల్గొన్న వారి పాత్రను గుర్తిం చేందుకు వీడియోలు, సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నట్లు సమాచారం.

దర్యాప్తులో లభించే ఆధారాల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు తీసు కుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ఈ ఘటన జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, కేసు దర్యాప్తుపై అందరి దృష్టి నెలకొంది.

# సైనిక స్థావరాల సమీపంలో
## పాక్ నిఘా డ్రోన్ కూల్చివేత



**శ్రీనగర్:** భారత సైనిక స్థావరాల సమీపంలో చక్కర్లు కొడుతున్న పాకిస్థాన్ నిఘా డ్రోన్‌ను ఆర్మీ కూల్చివేసింది. చైనా తయారీ డ్రోన్‌గా ఆర్మీ అధికారులు గుర్తించారు. అందులో ఉన్న మైక్రో ఎస్డీ కార్డును స్వాధీనం చేసుకున్నారు. జమ్మూలోని ఖౌర్ సెక్టార్‌లో ఈ సంఘటన జరిగింది. చక్లా గ్రామానికి సమీపంలోని కీలక రక్షణ స్థావరాల వద్ద పాక్ నిఘా డ్రోన్ ఎగురుతుండటాన్ని ఆర్మీ సిబ్బంది గమనించారు. వెంటనే దానిని కూల్చివేశారు. డ్రోన్ శకలాలతోపాటు అందులో ఉన్న 64 జీబీ మైక్రో ఎస్డీ కార్డును స్వాధీనం చేసుకున్నారు.

కాగా, చైనా తయారు చేసిన ఈ డ్రోన్‌ను నిఘా, గూఢచర్యం కార్యకలాపాల కోసం పాకిస్థాన్ వినియోగిస్తున్నట్లు ఆర్మీ అధికారులు ఆరోపించారు. స్వాధీనం చేసుకున్న డ్రోన్, మైక్రో ఎస్డీ కార్డు, ఇతర పరికరాలను ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపారు. ఆ డ్రోన్ మూలం, ప్రయాణ మార్గం, దాని లక్ష్యాలను నిర్ధారించడానికి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు.

# ఉద్యమంలో సోనమ్ వాంగ్‌చుక్ త్యాగాన్ని మర్చిపోలేం సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే



**ఢిల్లీ:** సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో సోనమ్ వాంగ్‌చుక్ త్యాగాన్ని మర్చిపోలేమని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే అన్నారు. తమ ఉద్యమంలో ఆయన కీలకంగా వ్యవహరించారని ప్రశంసించారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన ఉద్యమంలో పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ కీలకంగా మారిన సంగతి తెలిసిందే. ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సీజేపీ ఉద్యమానికి బలం పోసింది. అనంతరం విద్యార్థుల ఆందోళన, సోనమ్ దీక్ష విరమణ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి పరిణామాల గురించి తెలిసిందే. అయితే, సోనమ్ వాంగ్‌చుక్‌కు, సీజేపీకి, అభిజీత్ దీప్కేకు మధ్య విబేధాలు తలెత్తాయనే ప్రచారం తాజాగా జరుగుతోంది. ఇదే అంశంపై అభిజీత్ దీప్కేను మీడియా ప్రశ్నించింది. వాంగ్‌చుక్‌తో విబేధాలు వచ్చాయా అని అడిగింది. దీనికి అలాంటిదేమీ లేదని దీప్కే సమాధానం ఇచ్చారు. "ఉద్యమం సందర్భంగా సోనమ్ వాంగ్‌చుక్ సార్ చేసిన త్యాగాన్ని ఎలా మర్చిపోగలం. ఆయన తన ప్రాణాన్ని పణంగా పెట్టారు. 26 రోజులు నిరాహార దీక్ష చేశారు. తన ప్రాణాన్ని ప్రమాదంలోకి నెట్టి, దేశాన్ని మేల్కొల్పారు. తన జీవితం గురించి ఆలోచించకుండా దేశ యువతను వీధుల్లోకి వచ్చేలా చేశారు. ఆయన నిరాహార దీక్ష లేకుండా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధ్యమయ్యేది కాదు. సోనమ్ దీక్ష విరమించాలని నేను వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశాను. మీరు దీక్ష విరమించినా ఆందోళన కొనసాగిస్తానని ఆయనతో చెప్పా. ఆయన తన దీక్ష విరమించిన రోజు నేను ఎంతో ఉపశమనం పొందా" అని దీప్కే వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత జేపీ నడ్డా సమక్షంలో సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించడంపై మీరేమైనా అసంతృప్తికి లోనయ్యారా అంటూ కూడా దీప్కేను మీడియా ప్రశ్నించింది. దీనికి దీప్కే మాట్లాడుతూ.. "ఈ విషయంలో నేనేమీ నిరాశకు లోను కాలేదు. కానీ, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లు సోనమ్ వాంగ్‌చుక్‌ను కలిసేందుకు అనుమతించి, నన్ను అనుమతించలేదనే నేను నిరాశకు లోనయ్యా. ఆయనను కలిసేందుకు నాకు అనుమతి లభించలేదు. ప్రతిపక్ష ఎంపీలు ఆయనను కలిసేందుకు ప్రయత్నించినా వారిని కూడా అనుమతించలేదు. మరి మంత్రుల్ని మాత్రం ఎందుకు అనుమతించారు అని దీప్కే ప్రశ్నించారు. ఏదేమైనా వాంగ్‌చుక్ తన నిరాహార దీక్ష విరమించినందుకు సంతోషంగా ఉందన్నారు. దేశ భవిష్యత్తుకు ఆయన జీవితం ఎంతో ముఖ్యం అని దీప్కే అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి సీజేపీని ఒక రాజకీయ పార్టీగా మార్చే ఉద్దేశం తనకు లేదన్నాడు. రాజకీయాల్లోకి వచ్చి, ఎన్నికల్లో పోటీ చేయడం కంటే.. రాజకీయాల్లో మార్పు తేవడమే తమ లక్ష్యమన్నారు.

# మెదడులో కణతిని ముక్కులోంచి తీశారుఅమెరికాలో
## భారత సంతతి డాక్టర్ అరుదైన శస్త్రచికిత్స

**వాషింగ్టన్:** భారతీయ సంతతికి చెందిన అమెరికా డాక్టర్ మేజర్ జగత్‌కుమార్ పటేల్ అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. ఓ పేషెంట్ ముక్కు లోంచి .. మెదడులో ఉన్న గోల్ఫ్ బంతి సైజు కణితిని తొలగించారు. పుర్రెను చీల్చకుండానే ఆ సర్జరీ చేయడం విశేషం. జగత్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో సర్జరీ విజయవంతంగా జరిగింది. వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. న్యూరోసర్జన్ లెఫ్టినెంట్ కల్నల్ చార్లెస్ మిల్లర్ కూడా సర్జరీకి సహకరించారు. మెరైన్ కార్ప్స్ స్టాఫ్ సర్జెంట్ ఆండీ ఆర్చార్‌కు చికిత్స చేశారు. ఆయన సుమారు 15 ఏళ్ల నుంచి ఆ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. వినూత్నమైన రీతిలో మినిమల్ ఇన్వేసివ్ ప్రొసిజర్‌ను నిర్వహించినట్లు ఆర్మీ డాక్టర్లు వెల్లడించారు. అనుభవజ్ఞులైన ఇద్దరు డాక్టర్ల సమక్షంలో సర్జరీ జరిగినట్లు అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ పేర్కొన్నది. పేషెంట్ మెదడులో కణతి సుమారు 4.4 సెంటీమీటర్లు ఉన్నది. అతని పిట్యూటరీ గ్రంధి సమీపంలో ఆ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆ గ్రంధి.. ఆప్టిక్



నరాన్ని వత్తడం వల్ల.. పేషెంట్ కంటిచూపు ఇబ్బందులకు గురైనట్లు డాక్టర్లు గుర్తించారు. భారతీయ సంతతి డాక్టర్ పటేల్.. వినూత్న పద్ధతిలో ఎండోస్కోపీ ద్వారా.. ముక్కు నుంచి మెదడులో గోల్ఫ్ బంతి సైజులో ఉన్న కణతిని తొలగించినట్లు అమెరికా రక్షణ శాఖ పేర్కొన్నది. ఈ సర్జరీకి పటేల్ ప్లాన్ చేసినట్లు పెంటగాన్ పేర్కొన్నది. కణతి ప్రదేశం నిర్ధారణ జరిగితే, అప్పుడు పుర్రెను ఓపెన్ చేయాల్సిన అవసరం లేదని, ముక్కు ద్వారా సర్జరీని పూర్తి చేయవచ్చు అని మేజర్ పటేల్ పేర్కొన్నారు. పటేల్ తన ఎండోస్కోపీ నైపుణ్యం ద్వారా కెమెరాలను ముక్కు నుంచి మెదడులోకి పంపగా, ఇక న్యూరోసర్జన్ మిల్లర్ .. కణతిని కట్ చేసి బయటకు తీశారని పెంటగాన్ పేర్కొన్నది.

### ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్య కేసు ఆప్ మాజీ
## లీడర్ తాహిర్ హుస్సేన్ సహా మరో నలుగురికి జీవిత ఖైదు



**ఢిల్లీ:** ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో ఢిల్లీ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత తాహిర్ హుస్సేన్‌తోపాటు మరో నలుగురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఢిల్లీ, కార్కర్‌డూమా కోర్టు శుక్రవారం ఈ తీర్పు వెల్లడించింది. ఈ కేసులో తాహిర్ హుస్సేన్, నజీమ్, కాసిం, జావెద్, అనా స్‌లను నిందితులుగా ఈ నెల 13న కోర్టు గుర్తించింది. అయితే, నిందితులకు మరణ శిక్ష విధించాలని ఢిల్లీ పోలీసులు కోర్టును కోరారు. ఈ కేసును అత్యంత అరుదైన కేసు గా పరిగణించాలిన కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కానీ, కోర్టు చివరక యావజ్జీవ కారాగార శిక్ష విధించింది2020, ఫిబ్రవరి 25న సాయంత్రం ఐబీ అధికారి అంకిత్ శర్మ నిత్యావసర సరుకులు కొనేందుకు తన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే, తాహిర్ హుస్సేన్, ఇతర నిందితులు కలిసి అంకిత్ శర్మను కిడ్నాప్ చేశారు. అనంతరం అతడిని దారుణంగా హత్య చేశారు. ఈ సమయంలో ఢిల్లీలో ఘర్షణలు జరిగాయి. కేంద్ర చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు కొన్నిచోట్ల మత ఘర్షణలుగా కూడా మారాయి. ఈ మతం అనే కోణంలోనే అంకిత్ శర్మను కిడ్నాప్ చేసి, హత్య చేశారు. ఈ హత్య అనంతరం అతడి మృతదేహాన్ని నిందితులు ఈడ్చు కెళ్లారు. శరీరా భాగాల్ని కొన్నిచోట్ల కోసే శారు. ముఖంపై యాసిడ్ పోసి కాల్చేశారు. అతడిని గుర్తు పట్టకుండా చేయాలను కున్నారు. అనంతరం దగ్గర్లోని ఒక డ్రైన్‌లో అతడి మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. ఆలోపు అంకిత్ శర్మ కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. అతడు కనిపించకపోవడంతో మరుసటి రోజు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఇక, అతడి మృతదేహాన్ని గుర్తించిన తర్వాత పోలీసులు ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హత్యను వ్యతిరేకిస్తూ చాలా ఆందోళనలు జరిగాయి. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఢిల్లీ పోలీసులు వేగంగా విచారణ జరిపారు. నిందితులు తాహిర్ హుస్సేన్, నజీమ్, కాసిం, జావెద్, అనాస్‌లను అరెస్టు చేశారు. వీరిపై హత్య అభియోగాలు మోపారు. ఏ కారణం లేకుండా కేవలం మతం అనే కోణంలోనే ఈ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు ఆరోపించారు. గతంలో నిందితులకు, అంకిత్ శర్మకు ఎలాంటి విబేధాలు కూడా లేవు. చివరకు పోలీసుల వాదనలు విన్న కోర్టు ఈ ఘటనను అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణించింది. మతం వల్లే అత్యంత దారుణంగా నిందితులు ఈ హత్యకు పాల్పడ్డారని వ్యాఖ్యానించింది. తాజాగా నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది.

### యూనిఫామ్‌లు రక్తసిక్తమయ్యాయి గాయలతో ఇళ్లకు చేరుకున్నారు
## జంతర్‌మంతర్ వద్ద హింసపై పోలీస్ కుటుంబాల ఆవేదన



**న్యూఢిల్లీ:** యూనిఫామ్‌లు రక్తసిక్తమయ్యాయని, తమ వాళ్లు గాయలతో ఇళ్లకు చేరుకున్నారని, కొందరు ఆసుపత్రిపాలయ్యారని ఢిల్లీ పోలీస్ కుటుంబ సభ్యులు వాపోయారు. నీట్ లీక్ వివాదంపై సీజేపీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసన జూలై 20న హింసాత్మకంగా మారి పలువురు పోలీసులు గాయపడటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న తమ కుటుంబ సభ్యులపై జరిగిన దాడులను చూసి తాము అనుభవించిన భయానక, బాధాకరమైన అనుభవాలను శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, పోలీస్ శాఖలో పనిచేస్తున్న తమ వారు కేవలం తమ విధిని నిర్వర్తిస్తున్నారని, వారిని దూషించడం లేదా దుండగులుగా ముద్ర వేయడం ఏమాత్రం సమం జసం కాదని అన్నారు. 'ఒక యూనిఫాం వెను క కేవలం ఒక పోలీసు మాత్రమే ఉండరు. వారి వెనుక తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, కుటుంబం మొత్తం కుటుంబం ఉంటారు. వారు సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు అర్ధరాత్రి వరకు ఎదురుచూస్తూ ఉంటారు' అని పోలీస్ కుటుంబానికి చెందిన ఒక మహిళ తన బాధను పంచుకున్నారు.

తన తండ్రి సబ్-ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తు న్నాంని, అంతకుముందు భారత నౌకాదళంలో మెరైన్ కమాండోగా కూడా సేవల ందించారని ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి కుంజల్ తెలిపారు. 'జంతర్ మంతర్ వద్ద ఉన్న వేదిక దగ్గర ఒక గుంపు మా నాన్నను లాగి, దాదాపుగా చంపేసేంత తీవ్రంగా దాడి చేశారు. ఆయన నాలుగు గంటల పాటు ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో మా నాన్న సహచరులు ఆయనను ఇంటికి తీసుకువచ్చారు. ఆయన యూనిఫాం అంతా రక్తంతో పూర్తిగా ఎర్రగా మారిపోయింది. మా నాన్నను అలా చూడటం మాకు ఎంతో బాధాకరంగా అనిపించింది' అని వాపోయారు. అయితే తన తండ్రిపై దాడి జరిగిన తర్వాత సోషల్ మీడియాలో ఆయనను నేరస్తుడి'గా చిత్రీకరించడం అత్యంత బాధకు గురిచేసిందని విద్యార్థి కుంజల్ తెలిపారు. 'నా తండ్రిపై దాడి చేసిన వ్యక్తులు తమ నేరం నుంచి బయటపడేందుకు సుప్రీం కోర్టుకు వెళ్తున్నారని, అలాగే పోలీసు అధికారులందరిపైనా ఫిర్యాదులు చేయబోతున్నారని తెలిసినప్పుడు నాకు చాలా బాధ కలిగింది. నా తండ్రికి న్యాయం కోసం నేను కూడా పోరాడాలని నిర్ణయించుకున్నా. ఇతర పోలీసు కుటుంబాల నుంచి కూడా నాకు మద్దతు లభించింది' అని అన్నారు. మరో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్‌పై జరిగిన దాడి గురించి ఆయన భార్య సీమ వివరించారు. తన భర్త 33 ఏళ్ల కిందట కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరినట్లు తెలిపారు. జూలై 20న ఎప్పటిలాగే ఇంటి నుంచి భోజనం తీసుకుని ఉదయాన్నే డ్యూటీకి వెళ్లారని చెప్పారు. అయితే సాయంత్రం 7 గంటలకు ఫోన్ చేసినప్పుడు ఆయన ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు తెలిసి షాకయ్యానని అన్నారు. 'విధి నిర్వహణలో నా భర్తకు ఇచ్చిన హెల్మెట్ పూర్తిగా ధ్వంసమైంది. హెల్మెట్ పగిలిన తర్వాత ఒక రాయి గనుక ఆయన తలకు తగిలి ఉంటే, బహుశా ఆయన ఈ రోజు ప్రాణాలతో ఉండేవారు కాదు. ఆ విషయాన్ని తలుచుకున్నప్పుడు, ఆయన చెప్పిన మాటలు విన్నప్పుడు. ఒకవేళ అదే జరిగి ఉంటే నా పరిస్థితి, నా కుటుంబ పరిస్థితి ఏమయ్యేదో అని నా మనసు వణికిపోయింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాజకీయ నాయకులు తమ గొంతు కూడా వినాలని బాధిత పోలీస్ కుటుంబాల సభ్యులు విజ్ఞప్తి చేశారు. 'విద్యార్థుల నిరసనను పోలీసులు క్రూరంగా అణచివేశారని, విద్యార్థులను కొట్టారని మాత్రమే ప్రచారం జరుగుతోంది. కానీ అది నిజం కాదు. నిరసనకు సంబంధించిన ఒక కోణం మాత్రమే బయటకు కనిపిస్తోంది, కానీ మరో వైపు ఉన్న వాస్తవం పూర్తిగా భిన్నంగా ఉంది. ఈ అంశంపై పార్లమెంటులో గళం ఎత్తాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నాం' అని విన్నవినంచారు.

పోలీస్ విధుల్లో ఉన్న తమ వారిపై జరిగిన దాడులపై న్యాయపోరాటం చేస్తామని మరి కొందరు పేర్కొన్నారు.

### ఒంటెను ఢీకొట్టిన ఎస్‌యూవీ ఆర్మీ మేజర్
## మృతి ఇద్దరు అధికారులకు గాయాలు



**జైపూర్:** ఆర్మీ అధికారులు ప్రయాణించిన ఎస్‌యూవీ వాహనం ఒక ఒంటెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనం పల్టీలు కొట్టింది. ఆర్మీ మేజర్ మరణించగా ఇద్దరు ఆర్మీ అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 12.30 గంటల సమయంలో ఆర్మీ మేజర్ హంజా ఆరిఫ్, డ్యూటీ ముగిసిన తర్వాత ఇద్దరు తోటి అధికారులతో కలిసి ఎస్‌యూవీలో ఆర్మీ స్టేషన్‌కు వెళ్తున్నారు. ఉన్నట్టుండి రోడ్డుపైకి ఒక ఒంటె రావడంతో ఆ వాహనం బలంగా దానిని ఢీకొట్టింది. ఆర్మీ వాహనం బోల్తాకొట్టి పలుమార్లు పల్టీలు కొట్టింది.

కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలు, సైనిక సిబ్బంది ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకోవడంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ఆర్మీ అధికారులను థైయత్‌లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. మేజర్ హంజా ఆరిఫ్ మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. గాయపడిన లెఫ్టినెంట్ ఆయుష్మాన్, లెఫ్టినెంట్ అభినవ్ రాథోర్‌కు చికిత్స అందిస్తున్నారు. ఒంటె కూడా అక్కడికక్కడే చనిపోయిందని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ ప్రమాదంలో మరణించిన ఆర్మీ మేజర్ హంజా ఆరిఫ్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఆర్మీ అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితమే ఆయనకు వివాహం జరిగినట్లు చెప్పారు. స్థానిక పోలీసులు, మిలిటరీ సంయుక్తంగా ఈ ప్రమాదంపైదర్యాప్తుచేస్తున్నట్లు వెల్లడించారు.

# పాకిస్థాన్‌లోని బ్రాడ్ పీక్‌పై విరిగిపడ్డ కొండచరియలు శిథిలాల్లో ప్రఖ్యాత నేపాలీ క్లైంబర్ నిర్మల్ పుర్జా



**గిల్‌గిత్:** పాకిస్థాన్‌లో ఉన్న బ్రాడ్ పీక్ పర్వతం బేస్ వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం రోజు బ్రాడ్ పీక్‌పై కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ ఘటనలో పది మంది పర్వతారోహకులు అదృశ్యమయ్యారు. అయితే శుక్రవారం పాకిస్థాన్ ఆర్మీ సుమారు నలుగురి మృతదేహాలను గుర్తించింది. ఇంకా ఆరుగురు పర్వతారోహకుల ఆచూకీ దొరకలేదు. పాకిస్థాన్‌లోని కరకోరమ్ పర్వత శ్రేణుల్లో కే2గా పిలువబడే బ్రాడ్ పీక్ పర్వతం ఉన్నది. ఆ శిఖరం ఎత్తు 8,047 మీటర్లు. మృతిచెందిన పర్వతారోహకుల్లో.. ప్రఖ్యాత నేపాలీ మౌంటనీర్ నిర్మల్ పుర్జా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మిస్సైన వారిలో ఆరుగురు నేపాలీ క్లైంబర్స్, ఓ పాకిస్తానీ, ఓ ఒమన్ దేశస్తుడు, ఓ అమెరికన్, చైనా క్లైంబర్ ఉన్నట్లు ఆల్‌ఫైన్ క్లబ్ ఆఫ్ పాకిస్థాన్ ప్రకటించింది. ప్రస్తుతం ఆచూకీ లేని ఆరుగురు మృతదేహాల కోసం గాలింపు, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 14 అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన రికార్డు నిర్మల్ పుర్జా పేరిట ఉన్నది. ఆయన వయసు 43 ఏళ్లు.

బేస్ క్యాంప్ వద్ద విరిగిపడ్డ కొండచరియలు సుమారు వెయ్యి మీటర్ల కిందకు నెట్టుకెళ్లాయని, దీంతో అక్కడ ఉన్న క్లైంబర్స్ ఆ శిదిలాల్లో ట్రాప్ అయినట్లు జీపీఎస్ లొకేషన్ ద్వారా తెలుస్తోందని అధికారులు చెబుతున్నారు. నిర్మల్ పుర్జా జీపీఎస్ ట్రాకర్ ఇంకా కదులుతోందని ఓ నిపుణుడు పేర్కొన్నాడు. కొండచరియలు విరిగిపడిన తర్వాత రికార్డు అయిన లొకేషన్ నిత్యం మారుతూ వస్తోందన్నారు. నిజానికి పుర్జా ఆచూనీ చిక్కకపోయినా.. అతని జీపీఎస్ కదులుతున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో 8వేల మీటర్ల ఎత్తు దాటిన 14 పర్వతాలను పుర్జా మూడు సార్లు ఎక్కేశాడు. ఇక సెవన్ సమ్మిట్స్‌ను మూడు సార్లు అధిరోహించాడు. నేపాలీ మౌంటనీరింగ్ సంఘం అతని ఆచూకీ కోసం ఎదురుచూస్తోంది.

# ఇండియాకు రానున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
## గాల్వాన్ ఘర్షణ తర్వాత భారత్‌కు తొలిసారి



**చైనా:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో ఇండియా రానున్నారు. వచ్చే సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగి బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే, ఇండియా-చైనాల మధ్య జరిగిన గాల్వాన్ ఘర్షణ తర్వాత జిన్‌పింగ్ ఇండియాలో పర్యటించనుండటం తొలిసారి అవుతుంది. 2020లో జరిగిన ఈ ఘర్షణ తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు పాక్షికంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే.

న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనుంది. ఈ రెండు రోజులపాటు జిన్‌పింగ్ ఇండియాలో పర్యటిస్తారు. భారత్-చైనాల మధ్య సంబంధాల బలోపేతానికి జిన్‌పింగ్ రాక ఎంతగానో ఉపయోగపడు తుందనేది విశ్లేషకుల అభిప్రాయం. జిన్‌పింగ్ 2013 నుంచి చైనాకు అధ్యక్షుడిగా వ్యవ హరిస్తున్నారు. ఈ పదమూడేళ్లలో జిన్‌పింగ్ మూడుసార్లు మాత్రమే ఇండియాలో పర్యటించారు. చివరిసారిగా 2019, అక్టోబర్‌లో ఇండియాకు వచ్చారు. ఆ తర్వాత 2020 నుంచి సరిహద్దు (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ)) విషయంలో వివాదం చెలరేగడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో చైనా, ఇండియా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం ముందుగా చైనాతో చర్చించేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో పర్యటించే అవకాశం ఉంది. అక్కడి అగ్రనేతలతో అజిత్ దోవల్ ఉన్నతస్థాయి చర్చలు జరుపుతారు. ఈ చర్చలు సానుకూలంగా ఉంటే.. జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా ఢిల్లీలో మోదీతోపాటు భారత అగ్రనాయకులతో కూడా ఆయన చర్చించే అవకాశం ఉంది. బ్రిక్స్ సదస్సుకు పలు దేశాధినేతలు కూడా హాజరవుతారు. ఇరు దేశాల మధ్య చర్చలు కీలకం కానున్నాయి.

# నెయ్యి రుచికరమైన ఆహారంగానే కాదు ఆరోగ్య సమస్యలను తగ్గించడంలోనూ ఇలా పనిచేస్తుంది

నెయ్యిని ఆహారంలో భాగంగా తీసుకోవడం భారతీయ ఇళ్లలో సర్వసాధారణం. అయితే ఈ నెయ్యి కేవలం రుచిని పెంచడానికే కాదు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుందని ఆయుర్వేదం పేర్కొంటోంది. ఈ చిట్కాలను వైద్య సలహాతో మాత్రమే పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నెయ్యిని భారతీయ సంప్రదాయంలో ఎంతో విలువైన ఆహారంగా భావిస్తారు. బలహీనత, పొడి చర్మం, కీళ్ల నొప్పులు వంటి అనేక సమస్యలకు ఇది ఉపయోగపడుతుందని చాలాకాలంగా విశ్వసిస్తున్నారు. ముఖ్యంగా వాతావరణం చల్లగా ఉన్న సమయంలో శరీరానికి వెచ్చదనం అందించడంలో నెయ్యి కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే చాలామంది రోజువారీ ఆహారంలో నెయ్యిని తప్పకుండా చేర్చుకుంటారు. జలుబు, ముక్కు దిబ్బడ లేదా సైనసైటిస్ వంటి సమస్యలు వచ్చినప్పుడు కూడా నెయ్యితో చేసే కొన్ని ఇంటి చిట్కాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో ఒకటి నెయ్యిలో కొన్ని వెల్లుల్లి రెబ్బలను స్వల్పంగా వేయించి గోరువెచ్చగా తినడం. ఇది శరీరానికి వేడి అందించి ఉపశమనం కలిగిస్తుంది.



**చలి ప్రభావం ఎక్కువగా ఉంటే..**

మరో సంప్రదాయ పద్ధతి ఏమిటంటే.. గోరువెచ్చని నెయ్యిని ఛాతి, చేతులు, కాళ్లపై మర్దనా చేయడం. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు శరీరంలోని ఈ భాగాల ద్వారా చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నిద్రపోయే ముందు కొద్దిగా గోరువెచ్చని నెయ్యిని చేతులు, కాళ్లకు రాస్తే శరీరం వెచ్చగా ఉండటంతోపాటు చర్మం పొడిబారకుండా కూడా సహాయపడుతుంది. ఆయుర్వేదంలో నస్య అనే చికిత్సా విధానంలో గోరువెచ్చని స్వచ్ఛమైన ఆవు నెయ్యిని ముక్కులో కొన్ని చుక్కలు వేయడం గురించి కూడా ప్రస్తావిస్తారు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఈ విధానం పాటిస్తే ముక్కు దిబ్బడ తగ్గి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. తీవ్రమైన దిబ్బడ ఉన్నప్పుడు ఉదయం, రాత్రి నిద్రకు ముందు రోజుకు రెండు సార్లు చేయవచ్చని కూడా పేర్కొంటున్నారు.

**స్వచ్ఛమైన ఆవు నెయ్యిని వాడాలి..**

అయితే ఈ విధానాన్ని తప్పనిసరిగా అనుభవం ఉన్న ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలోనే చేయాలి. ఉపయోగించే నెయ్యి స్వచ్ఛమైన ఆవు పాలతో తయారైనదై ఉండాలి. అలాగే అది కేవలం గోరువెచ్చగా మాత్రమే ఉండాలి; ఎక్కువ వేడిగా ఉంటే ముక్కు లోపలి భాగానికి హాని కలిగించే ప్రమాదం ఉంటుంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇంటి చిట్కాలు కొంత ఉపశమనం ఇస్తాయి. అయితే జలుబు, ముక్కు దిబ్బడ లేదా సైనస్ సమస్యలు ఎక్కువ రోజులు కొనసాగినా, జ్వరం, తీవ్రమైన నొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించినా స్వయంగా చికిత్స చేసుకోకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# స్ట్రాబెర్రీలను కొనే ముందు తెలుసుకోవాల్సిన విషయాలివే ఇలా చేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటాయి

స్ట్రాబెర్రీలు రుచికరమైన బెర్రీ పండ్లలో ఒకటి. తీపి, స్వల్ప పులుపు కలిసిన వీటి ప్రత్యేక రుచి చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటుంది. రుచితోపాటు పోషక విలువలు కూడా సమృద్ధిగా ఉండే ఈ పండ్లు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, మాంగనీస్, ఫోలేట్, పొటాషియం, బి విటమిన్లు వంటి అనేక కీలక పోషకాలను అందిస్తాయి. అయితే మంచి నాణ్యమైన స్ట్రాబెర్రీలను ఎంపిక చేయడం, వాటిని సరైన విధంగా నిల్వ చేయడం తెలియకపోతే అవి త్వరగా మెత్తబడిపోవడం లేదా పాడైపోవడం జరుగుతుంది. కొన్ని సులభమైన సూచనలు పాటిస్తే తాజా స్ట్రాబెర్రీలను ఎక్కువ కాలం ఆస్వాదించవచ్చు. స్ట్రాబెర్రీలు సంవత్సరమంతా కొన్ని ప్రాంతాల్లో లభించినప్పటికీ, శీతాకాలంలో కొనుగోలు చేస్తే మరింత తాజా రుచి, మంచి నాణ్యత లభిస్తుంది. ఈ కాలంలో పండే స్ట్రాబెర్రీలు సహజమైన తీపి, సువాసనతో ఉంటాయి. అందువల్ల సీజన్‌లోనే వీటిని కొనుగోలు చేయడం ఉత్తమం. అయితే అన్ సీజన్‌లోనూ వీటిని సరిగ్గా ఎంపిక చేసి నిల్వ చేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటాయి.



**వాసన ముఖ్యం..**

స్ట్రాబెర్రీలను కొనుగోలు చేసే సమయంలో వాటి సువాసనను గమనించాలి. తాజాగా ఉన్న పండ్లకు సహజమైన తియ్యని వాసన ఉంటుంది. దుర్వాసన లేదా పులిసిన వాసన వస్తే వాటిని కొనుగోలు చేయకపోవడం మంచిది. వీలైతే సూపర్‌మార్కెట్‌ల కంటే స్థానిక రైతు బజార్లు లేదా తాజా పండ్లు విక్రయించే దుకాణాల నుంచి కొనుగోలు చేస్తే మంచి నాణ్యత లభించే అవకాశం ఎక్కువ. స్ట్రాబెర్రీల రంగు, ఆకారాన్ని కూడా పరిశీలించాలి. మంచి స్ట్రాబెర్రీలు గట్టిగా ఉండి ప్రకాశవంతమైన ఎరుపు రంగులో కనిపిస్తాయి. పండుపై నల్లని మచ్చలు, గాయాలు లేదా బూజు ఉండకూడదు. ఇంకా పచ్చగా ఉన్న పండ్లను ఇంటికి తీసుకెళ్లి పండిస్తామని భావించకూడదు. అలాంటి పండ్లకు పూర్తి రుచి ఉండదు. అలాగే పండుకు పైభాగంలో ఉండే ఆకుపచ్చ కాడ తాజాగా, గట్టిగా ఉండటం కూడా నాణ్యతకు సూచిక.

**సైజు విషయంలోనూ..**

చాలా పెద్ద స్ట్రాబెర్రీల కంటే మధ్యస్థ పరిమాణంలో ఉన్న పండ్లను ఎంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఎక్కువ రుచిగా, రసంతో నిండుగా ఉంటాయి. చాలా పెద్ద పండ్లు కొన్నిసార్లు లోపల ఖాళీగా లేదా నీటి శాతం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయి. మరీ చిన్న పండ్లలో గింజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. స్ట్రాబెర్రీలను కొనుగోలు చేసిన వెంటనే కడగకూడదు. వెంటనే తినాలనుకుంటే మాత్రమే నీటితో శుభ్రం చేయాలి. ముందుగానే కడిగితే అవి నీటిని పీల్చుకుని త్వరగా మెత్తబడి పాడయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల తినే ముందు మాత్రమే కడగడం ఉత్తమం. వారంలోపు ఉపయోగించాలనుకుంటే స్ట్రాబెర్రీలను ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు. అయితే వాటిని పేపర్ టవల్‌లో చుట్టి ఉంచితే అదనపు తేమను పీల్చుకుని పండ్లు ఎక్కువ కాలం తాజాగా ఉంటాయి. తేమ ఎక్కువైతే అవి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

**ఫ్రీజర్‌లో పెడితే..**

ఒక సంవత్సరం వరకు నిల్వ చేయాలనుకుంటే ఫ్రీజర్‌లో ఉంచడం ఉత్తమ మార్గం. ముందుగా స్ట్రాబెర్రీలను బాగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తరువాత కాడలను తొలగించి గాలి చొరబడని డబ్బా లేదా జిప్‌లాక్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రీజ్ చేయాలి. ఇలా నిల్వ చేస్తే మంచు స్ఫటికాలు ఏర్పడకుండా ఉండటంతో పాటు పండ్ల నాణ్యత కూడా ఎక్కువకాలం నిల్వ ఉంటుంది. నిల్వ చేసిన స్ట్రాబెర్రీలను పై, సాస్‌లు, సలాడ్లు, సిరియల్స్‌లో కలిపి ఉపయోగించవచ్చు. అలాగే స్మూతీలు, మిల్క్‌షేక్‌లు లేదా డెజర్ట్‌లలో కూడా వీటిని వినియోగించవచ్చు. చాలా కాలం ఆస్వాదించవచ్చు.

# తులసి ఆకుల్లో ఎలాంటి సమ్మేళనాలు ఉంటాయి ఇవి ఏయే వ్యాధులకు పనిచేస్తాయి

తులసి భారతీయ సంస్కృతిలో పవిత్రమైన మొక్కగా మాత్రమే కాకుండా, ఆయుర్వేదంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఔషధ మూలికగా కూడా గుర్తింపు పొందింది. భారత ఉపఖండంలో సులభంగా పెరిగే ఈ మొక్క ప్రధానంగా ఆకుపచ్చ రంగులో ఉండే లక్ష్మీ తులసి, ఊదా రంగులో కనిపించే కృష్ణ తులసి అనే రెండు రకాలుగా లభిస్తుంది. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాల ఉష్ణమండల ప్రాంతాల్లో కూడా తులసి విస్తృతంగా పెరుగుతుంది. హిందూ సంప్రదాయంలో తులసిని పూజించడం, ఇళ్లలో పెంచడం వెనుక ఆధ్యాత్మిక కారణాలతోపాటు ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని భావిస్తుంటారు. తులసి ఆకులను క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడం, బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభించడం, చర్మం, జుట్టు సమస్యలు తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**శ్వాసకోశ సమస్యలకు..**

ఆయుర్వేదంలో తులసి ఆకులు, విత్తనాలు, ముఖ్యంగా తులసి నుంచి తీసే ఎసెన్షియల్ ఆయిల్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇవి శ్వాసకోశ సంబంధిత సమస్యలను




తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు పేర్కొంటున్నారు. తులసిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంతో పటు మధుమేహం, రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని నియంత్రించడంలో దోహదపడతాయి. తులసిలో ఉండే లినోలిక్ యాసిడ్ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఈ ఆకుల్లోని సహజ నూనెలు అలర్జీలు, బ్యాక్టీరియా, వైరస్‌లు, ఇతర సూక్ష్మజీవులపై పోరాడే లక్షణాలు కలిగి ఉంటాయి. అందుకే తులసి పేస్ట్, తులసి పొడిని అనేక హెర్బల్, సౌందర్య ఉత్పత్తుల్లో ఉపయోగిస్తుంటారు. వేప, తిప్పతీగ, పసుపు వంటి ఔషధ మూలికలతో కలిపి మొటిమలపై రాస్తే చర్మం శుభ్రపడటంతోపాటు మళ్లీ మొటిమలు వచ్చే అవకాశాన్ని కూడా తగ్గించవచ్చు.

**వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు..**

భారతీయ ఇంటి వైద్యంలో తులసికి ప్రత్యేక స్థానం ఉంది. జ్వరం, జలుబు వంటి సాధారణ సమస్యల నుంచి కొన్ని వైరల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ల వరకు తులసిని సంప్రదాయంగా ఉపయోగిస్తుంటారు. తులసి ఆకులను నీటిలో మరిగించి అందులో సుమారు రెండు గ్రాముల మిరియాల పొడి కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు శరీరానికి యాంటీ బ్యాక్టీరియల్ రక్షణ లభిస్తుంది. అల్లం, తులసి ఆకులు, మిరియాలను కలిపి తయారు చేసే కషాయం జలుబు, దగ్గు వంటి సమస్యల్లో ఉపశమనం కలిగిస్తుంది. తులసి శరీరంలోని విషపదార్థాలను తొలగించే డిటాక్సిఫైయింగ్, శుద్ధి చేసే గుణాలను కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్లే కాకుండా చర్మంపై ఉపయోగించడం వల్ల కూడా ప్రయోజనం కలుగుతుంది. దుంద, రింగ్‌వార్మ్ వంటి కొన్ని చర్మ సమస్యల ఉపశమనానికి కూడా తులసిని సంప్రదాయంగా ఉపయోగిస్తున్నారు. తులసిని తాజాగా కోసిన ఆకుల రూపంలో నేరుగా నమలవచ్చు. అలాగే టీలో కలిపి తాగవచ్చు, కషాయం తయారు చేసుకోవచ్చు, పొడి లేదా పేస్ట్ రూపంలోనూ, హెర్బల్ సప్లిమెంట్ల రూపంలోనూ వినియోగించవచ్చు.

## ఇంట్లో ఉండే ఈ సహజసిద్ధమైన పదార్థాలతోనే చర్మాన్ని సురక్షితంగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు



ఆరోగ్యవంతమైన, కాంతివంతమైన చర్మాన్ని పొందడానికి కేవలం ఖరీదైన క్రీములు, లోషన్లు ఉపయోగించడం మాత్రమే సరిపోదు. చర్మ సౌందర్యానికి సరైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అంతే ముఖ్యమైనవి. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే చర్మం సహజ కాంతిని సంతరించుకోవడమే కాకుండా తేమను నిల్వ చేసుకుని వృద్ధాప్య లక్షణాలు కూడా ఆలస్యంగా కనిపించే అవకాశం ఉంటుంది. డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి సూర్యరశ్మిలోని హానికరమైన అతినీలలోహిత కిరణాల ప్రభావం నుంచి చర్మాన్ని కొంతవరకు రక్షించడంలో సహాయపడతాయి. అలాగే చర్మంలో తేమను నిల్వ ఉంచి మృదువుగా, కాంతివంతంగా కనిపించేలా చేయడంలో దోహదపడతాయి. పెరుగు చర్మ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో ఒకటి. దీనిని తినడంతోపాటు ఆలివ్ నూనె కలిపి ఫేస్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఇలా చేయడం వల్ల సన్నని ముడతలు, మొటిమలు తగ్గడంతోపాటు చర్మం మృదువుగా మారడానికి సహాయపడుతుంది.

**పసుపు కలిపిన వేడి పాలు..**

పసుపు కలిపిన వేడి పాలు అనారోగ్య సమయంలో మాత్రమే కాకుండా చర్మ ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. ప్రతి రోజూ రాత్రి నిద్రపోయే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో కొద్దిగా పసుపు కలిపి తాగితే చర్మం శుభ్రంగా ఉండటంతోపాటు సహజమైన కాంతి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జిడ్డు చర్మం కారణంగా తరచూ మొటిమలతో బాధపడేవారికి దాల్చిన చెక్క ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులోని సహజ గుణాలు మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకోవడంలో సహాయపడతాయి. దాల్చిన చెక్క పేస్ట్‌ను చర్మంపై రాస్తే రక్తప్రసరణ మెరుగుపడి మొటిమలు తగ్గే అవకాశముంటుంది. అవిసె గింజలు ఒమెగా3 కొవ్వు ఆమ్లాలకు మంచి వనరు. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడటంతోపాటు చర్మంలో తేమను నిల్వ ఉంచి పొడిబారకుండా కాపాడతాయి. దానిమ్మ పండులో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలోనే కాకుండా వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేయడంలో, ఎండ వల్ల దెబ్బతిన్న చర్మాన్ని సంరక్షించడంలో కూడా దోహదపడతాయి.

**కొబ్బరినూనె, రెడ్ వైన్..**

కొబ్బరి నూనె సహజమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు లేదా అవసరాన్ని బట్టి చర్మంపై కూడా ఉపయోగించవచ్చు. రెడ్ వైన్‌ను పరిమిత మోతాదులో తీసుకుంటే గుండె ఆరోగ్యంతోపాటు చర్మ ఆరోగ్యానికి కూడా కొంత మేలు చేస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే మద్యం సేవించడం ఆరోగ్యానికి ప్రమాదకరమని గుర్తుంచుకోవాలి. అందువల్ల దీనిని చర్మ ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా ప్రారంభించడం లేదా సేవించాలని సిఫారసు చేయడం లేదు. నీరు చర్మ ఆరోగ్యానికి అత్యంత అవసరం. తగినంత నీరు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లి చర్మం తేమను నిల్వ చేసుకుంటుంది. దీంతో సహజమైన కాంతి పెరగడంతోపాటు చర్మం తాజాగా కనిపిస్తుంది.

**బెర్రీ పండ్లు..**

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, బ్లాక్‌బెర్రీలు, రాస్ప్‌బెర్రీలు వంటి బెర్రీ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో, చర్మం బిగుతుగా ఉండేలా చేయడంలో, చర్మ నిర్మాణాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. టమాటా సహజ అస్ట్రింజెంట్‌గా పనిచేస్తుంది. టమాటా రసాన్ని ముఖంపై రాసుకోవడం వల్ల జిడ్డు చర్మం, మొటిమల సమస్య కొంతవరకు తగ్గుతుంది. అలాగే సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మానికి ఉపశమనం కలిగించి కాంతిని తిరిగి తీసుకురావడంలో సహాయపడుతుంది. సాల్మన్ చేపల్లో ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని తేమగా, మృదువుగా ఉంచడంలో దోహదపడతాయి. వీటిలో ఉండే సెలీనియం అనే ఖనిజం సూర్యరశ్మి వల్ల చర్మానికి కలిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పాలకూరలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మంపై మచ్చలను తగ్గించడంలో, ముందస్తు వృద్ధాప్య లక్షణాలను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. పాలకూరను తరచూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉండే అవకాశం ఉంటుంది. చర్మ సౌందర్యం కోసం బయటి సంరక్షణతో పాటు లోపలి పోషణ కూడా చాలా ముఖ్యం. సమతుల ఆహారం, తగినంత నీరు, క్రమబద్ధమైన జీవనశైలిని పాటించడం ద్వారా చర్మం సహజ కాంతిని పొందడంతో మెరుగుపడుతుంది.

## ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్



కండలు పెంచాలన్నా, కొవ్వును కరిగించాలన్నా తక్కువ కార్బోహైడ్రేట్‌లు, ఎక్కువ ప్రొటీన్‌లు ఉన్న ఆహారం తీసుకోవాలి. మార్కెట్లో ప్రొటీన్ పౌడర్లు, ఇతర ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఇంట్లోనే ప్రొటీన్ పౌడర్‌ని తయారు చేసుకోవచ్చు. అర కప్పు శనగపప్పు, అర కప్పు బాదాం, పావు కప్పు కాజు, పావు కప్పు గుమ్మడి గింజలు, రెండు టేబుల్ స్పూన్ల అవిసె గింజలు లేదా చియా గింజలతో ప్రొటీన్ పౌడర్ తయారు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో తేలికగానే ఈ ప్రొటీన్ పౌడర్ తయారవుతుంది. ఈ గింజలు, విత్తనాలను వేర్వేరుగా పెనం మీద మూడు నుంచి నాలుగు నిమిషాలు వేయించాలి. చల్లబడ్డాక వాటిని మిక్సీలో పిండి చేయాలి. గాలి చొరబడని గాజు సీసాలో ఈ ప్రొటీన్ పిండిని నిల్వ చేసుకోవాలి. ఒకటీ రెండు వారాలపాటు వాడుకోవచ్చు. ఇలా చేస్తే డబ్బులు ఆదా అవుతాయి. రుచి కోసం కలిపే రసాయనాల నుంచి తప్పించుకోవచ్చు.

TGTEL/25/A4111
జర్నలిస్ట్ మంచితనం దినపత్రిక
MANCHITANAM JOURNALIST DAILY
శనివారం, ఆగస్టు 01 2026





# భారత్‌కు తొలిసారి విచ్చేస్తున్న బ్రెజిల్ కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్



ఫిఫా వరల్డ్‌కప్ జోష్ ముగిసినా.. భారత్‌లో మళ్లీ ఫుట్‌బాల్ సందడి మొదలవ్వనుంది. మేటి జట్లలో ఒకటైన బ్రెజిల్ అక్టోబర్‌లో ఇండియాకు వస్తోంది. భారత జట్టుతో మ్యాచ్ కోసం ఆ దేశ సీనియర్ జట్టు రావడం ఖరారైందని బ్రెజిలియన్ ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది. ఫుట్‌బాల్ అంటే పడిచచ్చే జనమున్న కోల్‌కతాలో అక్టోబర్ 3వ తేదీన బ్లూ టైగర్స్‌ను బ్రెజిల్ ఢీకొట్టనుంది. 'ది గోట్ ఇండియా టూర్' పర్యటనలో లియోనల్ మెస్సీ బృందం అభిమానులతో మమేకమైన సాల్ట్ లేక్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగనుంది.'బ్రెజిల్ జాతీయ జట్టు షెడ్యూల్ కొనసాగుతోంది. ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం మా తర్వాతి అడుగు భారత్‌లో. మా ఫుట్‌బాల్ చరిత్రలో అదొక మరపురాని అధ్యాయం కానుంది. అక్టోబర్ 3వ తేదీన భారత గడ్డపై బ్రెజిల్ టీమ్ మొట్టమొదటి మ్యాచ్ ఆడనుంది. ఇందుకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం వేదిక కానుంది.ఏళ్ల తరబడి బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టుకు భారీగా అభిమానులున్న కోల్‌కతాలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడడం చాలా ప్రత్యేకం కానుంది. ఈ పర్యటన కోసం మేము ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం.

మిమ్మల్ని కోల్‌కతాలో కలుస్తాం' అని సీబీఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. నెయ్ మర్ సారథ్యంలోని బ్రెజిల్ ఫిఫా వరల్డ్‌కప్ 2026లో నాకౌట్ దశలోనే వెనుదిరిగిన విషయం తెలిసిందే.

# యాషెస్ కోసం స్టోక్స్ యూటర్న్ ఈసీబీ రియాక్షన్ ఇదే

టెస్టు కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకంతో ఇంగ్లండ్ మళ్లీ విజయాల బాట పట్టాలనుకుంటోంది. ఈక్రమంలోనే వచ్చే ఏడాది స్వదేశంలో జరుగబోయే యాషెస్ సిరీస్‌పై ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు దృష్టి సారిస్తోంది. గత సీజన్‌లో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్న ఇంగ్లండ్ అందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ మాట్లాడుతూ.. మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ యూటర్న్ తీసుకొనే అవకాశాలు లేకపోలేదని చెప్పాడు.వచ్చే ఏడాది యాషెస్ సిరీస్‌లో లక్ష్యంగా స్క్వాడ్ కూర్పుపై దృష్టి సారించింది ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు. కొత్త కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ నేతృత్వంలో నిలకడగా విజయాలు సాధించాలనుకుంటున్న ఇంగ్లండ్.. మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ యూటర్న్ తీసుకున్నా అందుకు సరే అనేలా ఉంది. ఇంతకు ఈ విషయాన్ని జట్టు మేనేజింగ్ డైరెక్టర్ రాబిన్ కీ స్వయంగా వెల్లడించాడు. అంతకుముందు ఆస్ట్రేలియా కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ మాట్లాడుతూ.. 'స్టోక్స్ మరొక యాషెస్ ఆడాలనితాను కోరుంటున్నాన'ని అన్నాడుమెక్‌డొనాల్డ్ కామెంట్స్‌పై స్పందించిన రాబి.. 'మామూలుగా అయితే వీడ్కోలు అనంతరం స్టోక్స్ కామెంటరీ బాక్స్‌లో ఉండాలి. కానీ, ఆసీస్ కోచ్ కోరుకున్నట్టు అతడు తన నిర్ణయాన్ని మార్చుకుంటే జట్టులోకి తీసుకుంటాం. స్టోక్స్‌తో ఏదైనా సాధ్యమే. అతడు గనుక యూటర్న్ తీసుకుంటే అది చాలా గొప్ప విషయం. అయితే.. అతడు తన ఆలోచనను మార్చుకోకపోవచ్చు. అందులో నాకు ఆశ్చర్యమేమీ లేదు. కానీ, ఏదైనా జరిగే అవకాశముంది' అని పేర్కొన్నాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య వచ్చే ఏడాది జూన్ 18 నుంచి ఐదు టెస్టుల యాషెస్ సిరీస్ జరుగనుంది.



**లార్డ్స్ టెస్టు మధ్యలోనే**

ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌ను 'స్టోక్స్‌కు ముందు.. స్టోక్స్ తర్వాత' అని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే.. సంప్రదాయ క్రికెట్‌నే నమ్ముకున్న జట్టుకు దూకుడు నేర్పిన కెప్టెన్లలో స్టోక్స్ పేరు ముందు వరుసలో ఉంటుంది. ఎంత పెద్ద లక్ష్యమైనా సరే.. వికెట్లు పడుతున్నా సరే.. దంచుడే పరమావధిగా ఆడడం అతడి నైజం. 2022లో జో రూట్ వారసుడిగా టెస్టు పగ్గాలు అందుకున్న స్టోక్స్.. బజ్‌బాల్ ఆటను పరిచయం చేశాడు.

బ్రెండన్ మెక్‌కల్లమ్ హెడ్‌కోచ్‌గా, దూకుడే మంత్రగా ఆడే స్టోక్స్ సారథ్యంలో.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ వన్డే తరహాలో ఆడడం అలవర్చుకుంది ఇంగ్లండ్. అయితే.. యాషెస్ సిరీస్‌లో పరాజయం, ఆపై స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 1-2తో సిరీస్ ఓటమితో విమర్శలపాలయ్యాడు స్టోక్స్. ఇక టైమ్ వచ్చేసింది అనుకున్నాడేమో లార్డ్స్ టెస్టు మధ్యలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడీ వెటరన్.

# చీఫ్ సెలెక్టర్ రేసులో అశ్విన్ వరల్డ్‌కప్ ముందే బాధ్యతలు చేపట్టేనా



వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కంటే ముందు చీఫ్ సెలెక్టర్‌గా సేవలందిస్తున్న అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియనుంది. సెప్టెంబర్‌తో అగార్కర్ కాలపరిమితి పూర్తి కానున్నందున తదుపరి ప్రధాన సెలెక్టర్ ఎవరు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అశావహులు చాలామందే ఉన్నప్పటికీ మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ రేసులో అందరికంటే ముందున్నాడనే కథనాలు వస్తున్నాయి. బీసీసీఐ కూడా అగార్కర్ స్థానంలో మాజీ ఆఫ్ స్పిన్నర్రైన యశ్‌కు బాధ్యతలు అప్పగించనుందనే వార్తలు నెట్టింట వైరలవుతున్నాయి.సీనియర్లను పక్కన పెట్టేసి.. కుర్రాళ్లకు పెద్దపీట వేయడంతో పాటు స్క్వాడ్ ఎంపిక కూడా అస్సలు బాగుండడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ గడ్డపై టీ20 సిరీస్ ఓటమితో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, ప్రధాన సెలెక్టర్ అగార్కర్ పనితీరపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో, పదవీకాలం ముగింపు దశలో ఉన్న గవార్కర్‌ను పొడిగిస్తారా లేదా అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. అప్పుడే అగార్కర్ వారసుడు ఎవరు అనే చర్చ మొదలైంది. ఎందుకంటే.. మరో నెల రోజుల్లో(సెప్టెంబర్) చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ పదవీకాలం ముగియనుంది. దాంతో, కాబోయే ప్రధాన సెలెక్టర్ ఎవరు పోటీలో ఎవరెవరు ఉన్నారు అనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అగార్కర్ అనంతరం మాజీ ఆటగాడు రవించంద్రన్ అశ్విన్ ప్రధాన సెలెక్టర్ పదవిని చేపట్టే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి.

వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ముందే అశ్విన్ నియామకం జరుగుతుందని ఆన్‌లైన్‌లో కథనాలు వస్తున్నాయి.

దాంతో.. ఒక్కసారిగా అశ్విన్ ఎక్స్‌లో ట్రెండ్ అవుతున్నాడు. రిటైర్మెంట్ అనంతరం సొంత యూట్యూబ్ ఛానెల్లో క్రికెట్ విశ్లేషణలు చేస్తున్న స్పిన్ దిగ్గజం మాత్రం ఈ వైరల్ వార్తలపై స్పందించలేదు. బీసీసీఐ సైతం అగార్కర్ మార్పుపై ఎలాంటి ప్రకటన ఇంకా చేయలేదు.

# ఫిట్‌నెస్ పరీక్షలో బుమ్రా పాస్ శ్రీలంక సిరీస్‌కు యార్కర్ కింగ్



శ్రీలంక పర్యటనకు ముందే భారత జటుకు గుడ్‌న్యూస్. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా (తిరిగి జట్టులోకి వచ్చేస్తున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఈ యార్కర్ కింగ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యాడు. దాంతో, త్వరలో లంకతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పొరుగుదేశమైన లంకకు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఆగస్టులో వెళ్లనుంది.పని ఒత్తిడి కారణంగా తంచూ గాయపడుతున్న జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసయ్యాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడిన బుమ్రా.. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన అతడు శ్రీలంక పర్యటనకు సిద్ధమవుతున్నాడని సమాచారం.దాంతో, ఇప్పటికే స్క్వాడ్‌కి ఎంపికైన బుమ్రా సిరీస్‌లో ఆడడం దాదాపు ఖరారైన నేపథ్యంలో భారత జట్టుకు పేస్ బౌలింగ్ కష్టాలకు తెరపడనుంది. ఆగస్టులో శుభ్‌మన్ సారథ్యంలోని భారత జట్టు లంకు వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 15 వ తేదీన గాలే స్టేడియంలో మొదటి టెస్టు.. ఆపై ఆగస్టు 23న కొలంబోలో రెండో టెస్టులో ఇరుజట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిఎ ర్యాంకి ంగ్స్‌లో 5వ స్థానం

# బాక్సింగ్ ఫైనల్లో ప్రీతి జూడో క్వార్టర్స్‌లో ముగ్గురు



కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే పదిమంది సెమీ ఫైనల్ దూసుకెళ్లగా.. వీరిలో ప్రీతి పవార్ ఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 54 కిలోల విభాగం సెమీస్‌లో పంచ్‌లతో చెలరేగిన ప్రీతి జాంబికాకు చెందిన జ్వాపేను చిత్తుగా ఓడించింది. ఇక జుడోలో ముగ్గురు ముందంజ వేశారు. మహి ళల జుడో పోటీల్లో శ్రద్ధా కడుబాల్ చొపాడే, పురుషుల విభాగంలో హర్ష్ సింగ్, రోహిత్ బిష్రలు క్వార్టర్ ఫైనల్ చేరారు.గ్లాస్గో ఆతిథ్యమిస్తున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్ ప్రీతి పవార్ ఫైనల్ చేరింది. శుక్రవారం ఏకపక్షంగా జరిగిన సెమీస్‌లో జ్వాపే(జాంబియా)పై పంచ్‌ల వర్షం కురిపించిందీ యువకెరటం. తొలి రౌండ్ నుంచే ప్రీతి ధాటికి ప్రత్యర్థి బెంబేలెత్తిపోయింది.

రెండో రౌండ్‌లోనూ అదే దూకుడు కొనసాగించిన భారత అమ్మాయి 5-0తో గెలుపొంది దర్జాగా ఫైనల్లో అడుగుపెట్టింది. దాంతో, ఆమెకు కనీసం రజతం ఖాయమైంది.

# మహిళల డిస్కస్ త్రోలో కాంస్యం గెలిచిన సీమా



గ్లాస్గో: భారతీయ మహిళా అథ్లెట్ సీమా కాలీరమణ కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం గెలుచుకున్నది. మహిళల డిస్కస్ త్రోలో ఆమెకు కాంస్యం దక్కింది. ఆమె తన మూడవ ప్రయత్నంలో డిస్కస్‌ను 58.65 మీటర్ల దూరం విసిరింది. మరో భారత ప్లేయర్ నిధి రాణి ఆ ఈవెంట్‌లో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నది. సీమా తన నాలుగవ, అయిదో, ఆరవ ప్రయత్నాల్లో ఫౌల్ చేసింది. కానీ మూడో రౌండ్‌లో ఆమె ప్రదర్శన కీలకంగా నిలిచింది. ఆ త్రో వల్లే ఆమెకు బ్రాంజ్ మెడల్ దక్కింది. జమైకాకు చెందిన సమంతా హాల్ ఈ ఈవెంట్‌లో స్వర్ణ పతకం దక్కించుకున్నది. ఆమె 61.66 మీటర్ల దూరం డిస్కస్‌ను విసిరేసింది. కెనడాకు చెందిన జూలియా టంక్స్ 60.67 మీటర్ల దూరం విసిరి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. ఇటీవలే బీబీకి జన్మనిచ్చిన సీమా.. మళ్లీ డిస్కస్‌లో రాణిస్తున్నది. 2025 నేషనల్ గేమ్స్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని సాధించింది. ఆమె ప్రస్తుతం పీహెచ్‌డీ చదువుతున్నదికామన్‌వెల్త్ క్రీడల్లో భారత పతకాల సంఖ్య 17కు చేరుకున్నది. దీంట్లో మూడు స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 8 రోజుల క్రీడలు ముగిశాయి. తాజా మెడల్స్ ప్రకారం ఇండియా పదవ స్థానంలో ఉన్నది. ఆస్ట్రేలియా అత్యధికంగా 110 మెడల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# జెర్సీ రంగు మార్పు వివాదంలో ట్విస్ట్ వివరణకు ఆదేశించిన హాకీ ఇండియా అధ్యక్షుడు

భారత హాకీ జట్ల జెర్సీ రంగు మార్పు వివాదం కొత్త మలుపు తిరిగింది. ఈ అంశంపై ఎగ్జిక్యూటివ్ బోర్డు అధికారులను వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ లేఖ రాశారు. భారత పురుషులు, మహిళల జట్ల నీలం జెర్సీని కాషాయ రంగులోకి మార్చే నిర్ణయాన్ని ఎగ్జిక్యూటివ్ బోర్డు ముందుకు తీసుకురాకుండానే అమలు చేశారని, తనకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇప్పటి వరకు ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన టిర్కీ.. తాజాగా దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేయడం చర్చకు దారి తీసింది.జాతీయ జట్టు గుర్తింపుతో ముడిపడిన ఇలాంటి కీలక నిర్ణయాలు ఎన్నికైన నాయకత్వం, ఎగ్జిక్యూటివ్ బోర్డుతో చర్చించిన తర్వాతే తీసుకోవాల్సిందని టిర్కీ పేర్కొన్నారు. ఈ అంశంపై ఒడిశా ప్రభుత్వం కూడా తనను వివరణ కోరిందని, అందుకే నిర్ణయం ఎలా తీసుకున్నారు ఎలాంటి ప్రక్రియ అనుసరించారు ఎవరి అనుమతితో అమలు చేశారనే వివరాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.




తదుపరి మెయిల్‌లో కూడా ఆయన ఐదు కీలక ప్రశ్నలు సంధిస్తూ, బోర్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఈ నిర్ణ యం ఎందుకు తీసుకున్నారో స్పష్టం చేయా లని కోరారు. దీంతో హాకీ ఇండియాలో అంత ర్గత విభేదాలు బహిర్గతమైనట్లు చర్చ జరుగుతోంది.అయితే అంతర్జాతీయ హాకీలో అంతటా వాడుతున్న సింథటిక్ పిచ్‌లు నీలి రంగులో ఉంటాయి. జెర్సీలు కూడా అదే రంగులో ఉంటే కలిసిపోతున్నాయని.. అందుకే ఆటగాళ్లు, కోచ్‌ల సూచనతో జాతీయ జెండాలో భాగమైన కాషాయాన్ని ఎంపిక చేశామని హాకీ ఇండియా పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే జెర్సీ రంగు మార్పుపై విమర్శలు వస్తూనే ఉన్నాయి.

# టీమిండియాకు గుడ్‌న్యూస్ శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా సిద్ధం

శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఓ గుడ్‌న్యూస్ అందింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో బుమ్రా పాసైనట్లు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వెల్లడించింది. దీంతో ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండనున్నాడు. ఈ సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ ఇటీవల జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. బుమ్రా, సాయి సుదర్శన్‌లకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని అందులో పేర్కొంది. తాజా పరిణామంతో బుమ్రా ఆడటంపై క్లారిటీ వచ్చినట్లే.ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. దీంతో లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు పూర్తిగా కోలుకుని శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి గాలేలో ప్రారంభమయ్యే తొలి టెస్టుతో పాటు ఆగస్టు 23 నుంచి కొలంబోలో జరిగే రెండో




టెస్టులోనూ ఆడే అవకాశాలు మెరుగయ్యాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. అందులో భాగంగా శ్రీలంకపై 2-0తో సిరీస్ గెలవడం భారత జట్టుకు అత్యంత కీలకం. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటన ఉండటంతో ఈ సిరీస్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

శనివారం,
ఆగస్టు 01 2026
TGTEL/25/A4111
జర్నలిస్ట్ మంచితనం దినపత్రిక
MANCHITANAM JOURNALIST DAILY




# టాలీవుడ్‌లో హాట్ టాపిక్ మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి రామ్ చరణ్ ఎన్టీఆర్



మల్టీప్లెక్స్ రంగంలోకి టాలీవుడ్ టాప్ హీరోలు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ప్రస్తుతం ఫిలిం నగర్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇప్పటికే అగ్ర కథానాయకులు మహేశ్ బాబు ఏఎంబీ సినిమాస్ అల్లు అర్జున్ ఏఏఏ సినిమాస్ విజయ్ దేవరకొండ ఏవీడీ సిని మాస్ రవితేజ ఏఆర్టీ సినిమాస పేర్లతో థియేటర్ల వ్యాపారంలో విజయవంతంగా రాణిస్తుండగా, ఇప్పుడు వారి బాటలోనే ఈ ఇద్దరు మెగా, నందమూరి హీరోలు కూడా అడుగుపెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోలు కేవలం సినిమాలతోనే కాకుండా వ్యాపార రంగంలోనూ తమ సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా మల్టీప్లెక్స్ బిజినెస్‌పై మన హీరోలు ఎక్కువగా ఆసక్తి చూపుతరున్నారు. ఇప్పటికే అగ్ర హీరోలతో మల్టీప్లెక్స్‌ల ఏర్పాటులో భాగస్వామ్యంగా ఉన్న ప్రముఖ డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ సంస్థ ఏషియన్ సినిమాస్ తోనే రామ్ చరణ్ చేతులు కలిపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఏఆర్సీ పేరుతో ఓ అత్యాధునిక హంగు లతో కూడిన మల్టీప్లెక్స్‌ను నిర్మించేందుకు సనాహాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.మరోవైపు యంగ్ టైగర్ ఎన్టీఆర్ సైతం ఎవరి భాగస్వామ్యం లేకుండా సొంతంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో ఒక ప్రీమియం మల్టీప్లెక్స్‌ను నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై అటు రామ్ చరణ్ కానీ, ఇటు ఎన్టీఆర్ టీమ్ కానీ అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఒకవేళ ఈ రూమర్స్ నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్దే కాకుండా థియేటర్ల వ్యాపారంలోనూ టాలీవుడ్ హీరోల మధ్య పోటీ మరింత రసవత్తరంగా మారడం ఖాయం.

# అభిమానులకు అప్‌డేట్


## కార్తీ 'సర్దార్ 2' టీజర్ లాంచ్‌కి టైం ఫిక్స్




కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం 'సర్దార్ 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటంటైనర్‌లో గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ కథానాయకిగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఎప్పటికప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్స్ ఇస్తూ ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ ట్రీట్ రాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.ఈ క్రమంలోనే హీరో కార్తీ తాజాగా ఒక పవర్-ప్యాక్డ్ కొత్త పోస్టర్‌ను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. 'సర్దార్ 2' సినిమా టీజర్‌ను నేడు శుక్రవారం సాయంత్రం సరిగ్గా 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ఆయన కన్ఫర్మ్ చేశారు. దీంతో కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కార్తీ అభిమానులు ఈ హై-వోల్టేజ్ టీజర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటి పార్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో, ఈ సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి.ఈ చిత్రంలో టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తుండటం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది.

ఇక మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్, ఈసారి కూడా తన మ్యూజిక్‌తో అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. అన్ని హం గులను పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్‌లో విడుదల చేసేం దుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు రాబోతున్న టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను రెట్టింపు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# న్యూటన్స్ థర్డ్ లా' రివ్యూ సుమంత్ క్రైమ్ థ్రిల్లర్ మెప్పించిందా




అక్కినేని హీరో సుమంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా'. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. భౌతిక శాస్త్ర సూత్రాన్ని మానవ జీవితంలోని కర్మ సిద్ధాంతంతో ముడిపెట్టి తెరకెక్కించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ సినిమా ఎలా ఉంది అనేది రివ్యూలో చూద్దాం.

**కథ**

ఇంజినీరింగ్ విద్యార్థి అయిన వినయ్ (త్రినాథ్ వర్మ) అనుమానాస్పద రీతిలో ఇంటిపై నుంచి పడి మరణిస్తాడు. అయితే ఈ కేసును ఛేదించే బాధ్యతను పోలీస్ ఆఫీసర్ వాసుదేవ్ (సుమంత్) తన భుజాన వేసుకుంటాడు. విచారణలో భాగంగా వినయ్ తల్లిదండ్రులు పార్వతి (షెల్లి ఎన్. కుమార్), గంగాధర్ (రవి వర్మ)లను విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తాయి. మరోవైపు, జ్యోతి అనే మహిళ యాక్సిడెంట్ కేసును కూడా వాసుదేవ్ టేకప్ చేస్తాడు. అసలు వినయ్ ఎవరు అతని మరణానికి, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ స్టీఫెన్ మెర్క్యురీ (జగపతి బాబు)కి ఉన్న సంబంధం ఏమిటి జ్యోతి యాక్సిడెంట్ కేసుకు, వినయ్ -- మెర్క్యురీలకు మధ్య ఉన్న లింక్ ఏంటఈ సంఘటనలన్నింటినీ ఆధారంగా చేసుకుని 'న్యూటన్ థర్డ్ లా' పేరుతో పుస్తకం రాసింది ఎవరు ఈ ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్ర కథ.

**విశ్లేషణ**

ప్రతి చర్యకు దానికి సమానమైన వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది అనే న్యూటన్ మూడో సూత్రాన్ని.. మంచైనా చెడైనా చేసే ప్రతి కర్మకు తగిన ఫలితం అనుభవించాలనే కర్మ సిద్ధాంతానికి అనుసంధానించిన తీరు ఆకట్టుకుంటుంది. ప్రథమార్ధంలో కథంతా 1999 నేపథ్యంలో సాగుతుంది. వినయ్ మరణం, జ్యోతి ప్రమాదం అనే రెండు ప్రధాన సంఘటనలతో సినిమా ప్రారంభమవుతుంది. పోలీస్ ఆఫీసర్‌గా సుమంత్ ఎంట్రీ ఇవ్వడం, విచారణను ప్రారంభించడం బాగుంది. అయితే, ప్రథమార్ధంలో కథనం కొద్దిగా నెమ్మదిగా సాగుతుంది. ఇంటర్వెల్ పాటికి అసలు నిజాలపై ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధంపై అంచనాలను పెంచారు. ద్వితీయార్ధంలో అసలైన యాక్షన్ మరియు క్రైమ్ డ్రామా మొద లవుతుంది. వినయ్, అతని స్నేహితుడు కార్తీక్ చేసిన తప్పిదం ఏమిటి మెర్క్యురీతో వారి ప్రయాణం ఎలా ముడిపడింది అనే విషయాలను ఉత్కంఠభరితంగా చూపించారు.నటీనటుల ప్రతిభసీరియస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో సుమంత్ తన సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. వినయ్‌గా త్రినాథ్ వర్మ, అతని స్నేహితుడు కార్తీక్‌గా పండిట్ గౌతమ్ తమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. వినయ్ తల్లిగా నటించిన షెల్లి కుమార్ భావోద్వేగ సన్నివేశాల్లో చక్కటి నటన కనబరిచారు. జగపతి బాబు అతిథి పాత్రలో మెరిశారు. నేహా పఠాన్, అవసరాల శ్రీనివాస్, రవివర్మ తదితరులు తమ పరిధి మేరకు నటించారు.

**సాంకేతిక విభాగం**

దర్శకుడు రాజేశ్ కర్ణ ఎంచుకున్న పాయింట్ రొటీన్‌గా అనిపించినా, స్క్రీన్ ప్లే ద్వారా ప్రేక్షకులను ఎంగేజ్ చేసే ప్రయత్నం చేశారు. సింజిత్ యర్రమిల్లి అందించిన నేపథ్య సంగీతం సినిమా మూడ్‌ను ఎలివేట్ చేసింది. వేద వ్యాస్ గొట్టిపాటి సినిమాటోగ్రఫీ, ఎడిటర్ పనితీరు కథకు తగినట్లుగా ఉన్నాయి. నిర్మాణ విలువలుసినిమాస్థాయికి తగ్గట్టుగా ఉన్నాయి

# 'బట్వారా 1947' పోస్టర్ వైరల్ కనికా కపూర్‌ను చూసి కియారా అద్వానీ అనుకున్న నెటిజన్లు





బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'బట్వారా 1947' సినిమా విడుదలకు ముందే సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సన్నీ డియోల్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన ఓ క్యారెక్టర్ పోస్టర్ ఇప్పుడు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నటి కనికా కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫ్లోరల్ సూట్, లైట్ బ్రౌన్ దుపట్టాతో ఎలాంటి గ్లామర్ హంగులు లేకుండా సింపుల్ లుక్‌లో కనిపించిన కనికాను చూసిన నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. పోస్టర్‌లో ఆమె రూపం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీని పోలి ఉండటంతో సోషల్ మీడియాలో పోలికలపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది."ఇది కనికా కపూర్ కాదు.. కియారా అద్వానీయే కదా?", "పోస్టర్‌లో కియారా పేరు ఎందుకు లేదు?", "ఏఐతో పోస్టర్ డిజైన్ చేశారా?" అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం లైటింగ్, మేకప్, ఫోటో ఎడిటింగ్ కారణంగానే ఈ పోలికలు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు. ఈ పోస్టర్ వైరల్ కావడంతో కనికా కపూర్ కూడా సరదాగా స్పందించారు. సోషల్ మీడియాలో తనను కియారా అద్వానీతో పోలుస్తూ వచ్చిన ఓ కామెంట్‌కు ఆమె నవ్వుతున్న ఎమోజీతో రిప్లై ఇచ్చారు. దీంతో ఈ చర్చకు మరింత ఊపు వచ్చింది. అయితే కనికా కపూర్ ఇతర ఫొటోలను పరిశీలిస్తే ఆమెకు కియారా అద్వానీతో పెద్దగా పోలికలు కనిపించవని అభిమానులు చెబుతున్నారు. ఈ ఒక్క పోస్టర్‌లో మాత్రమే కెమెరా యాంగిల్, లైటింగ్, మేకప్ కారణంగా ఇద్దరి రూపాల్లో సారూప్యత కనిపించిందని అభిప్రాయపడుతున్నారు.ఢిల్లీకి చెందిన కనికా కపూర్ 'బట్వారా 1947' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. అంతకుముందు 'ఏక్ దుజే కే వాస్తే 2' వంటి టెలివిజన్ సీరియల్స్, పలు వెబ్ సిరీస్‌లు, మోడలింగ్ రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. పలు బ్యూటీ పేజెంట్లలో విజేతగా నిలిచిన ఆమె చిన్నప్పటి నుంచే నటిగా రాణించాలని కలలు కనగా, ఇప్పుడు భారీ బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. దేశ విభజన నేపథ్యంలో రూపొందుతున్న బట్వారా 1947 లో సన్నీ డియోల్, ప్రీతి జింటా, షబానా ఆజ్మీ, కరణ్ డియోల్‌తో పాటు కనికా కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీత మాంత్రికుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# తొలి రోజే రూ.61 కోట్లు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించిన స్పైడర్ మ్యాన్





హాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన మొదటి రోజే అద్భుతమైన కలెక్షన్లతో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. ఇప్పటివరకు 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' (రూ.53.10 కోట్లు) పేరిట ఉన్న ఫస్ట్ డే కలెక్షన్స్ రికార్డ్‌ను ఈ సినిమా అధిగమించింది. ఇండియాలో మరే హాలీవుడ్ సినిమా సాధించని విధంగా తొలి రోజు ఏకంగా రూ. 61 కోట్ల నెట్ కలెక్షన్లతో ఆల్ టైమ్ నెంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకుంది.ఇండియా వ్యాప్తంగా అన్ని వెర్షన్లలో కలిపి 5,000 పైచిలుకు స్క్రీన్లలో ఈ సినిమా విడుదల కాగా.. హాలీవుడ్ చరిత్రలోనే ఇది ఇండియాలో అత్యంత భారీ విడుదల కావడం విశేషం.

అలాగే స్పైడర్-మ్యాన్ సిరీస్‌లో ఇదే అత్యధిక మొదటి రోజు వసూళ్లు కాగా, 'సోనీ పిక్చ ర్స్ఎంటర్‌టై న్‌మెంట్' బ్యానర్‌పై వచ్చిన చిత్రా ల్లో ఇండి యాలో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది.

మొదటి రోజే భారీ వసూళ్లు రాబ ట్టిన ఈ చిత్రం, లాంగ్ వీకెండ్ ముగిసేసరికి సుమారు రూ.2 00 కోట్ల వరకు కలెక్షన్లను సాధించే అవ కాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.


# అస్సాం వరద బాధితులకు అండగా బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ రూ.కోటి విరాళం



భారీ వర్షాలు, వరదలతో అతలాకుతల మవుతున్న అస్సాం రాష్ట్రానికి బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ తన ఉదారతను చాటాడు. కష్టకాలంలో ఉన్న అస్సాం ప్రభుత్వానికి ఆయన కోటి రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం ధృవీకరించడంతో పాటు నటుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అస్సాం వరదల్లో మృతుల సంఖ్య 78కి చేరడం, 3 లక్షలకు పైగా ప్రజలు నిరాశ్రయులు కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ క్లిష్ట సమయంలో కార్తీక్ ఆర్యన్ ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించడం పట్ల అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా స్పందిస్తూ.. మీ ఉదారమైన విరాళం మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. అస్సాం ప్రజలను ఆదుకోవడంలో మీ సాయం చాలా దూరం వెళ్తుంది అంటూ అభినందించారు. అంతకు ముందు సల్మాన్ ఖాన్ కూడా తన 'బీయింగ్ హ్యూమన్' ఫౌండేషన్ ద్వారా వరద బాధితులకు సహాయం అందించేందుకు ముందుకొచ్చిన విషయం తెలిసిందే.ప్రస్తుతం అస్సాంలో వరద పరిస్థితి తీవ్రంగా ఉంది. శివసాగర్, గోలాఘాట్ జిల్లాల్లో తాజాగా ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో ఈ ఏడాది వరద సంబంధిత మరణాల సంఖ్య 78కి చేరినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ (ASDMA) వెల్లడించింది. శివసాగర్, చరైదేవ్, గోలాఘాట్, జోర్హాట్, నాగావ్, బిశ్వనాథ్, కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాల్లోని దాదాపు 3,00,031 మంది ప్రజలు ఇంకా వరద ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 551 గ్రామాలు నీట మునగడంతో పాటు, వేలాది హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

# లండన్‌లో సీక్రెట్ డేటింగ్‌లో షారుఖ్ ఖాన్ కొడుకు వైరల్ అవుతున్న ఫోటోలు





బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ లండన్ ట్రిప్ హాట్ టాపిక్‌గా మారింది. ఆర్యన్ ఖాన్ లండన్‌లో ఒక రహస్య యువతితో కలిసి కనిపించడంతో, వీరిద్దరి డేటింగ్ రూమర్స్ ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. లండన్‌లోని ఒక క్యాసినో నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆర్యన్ ఖాన్, ఆ యువతి మీడియా కంటపడ్డారు. అయితే వీరిద్దరూ బ్లాక్ కలర్ ట్రెండీ అవుట్‌ఫిట్లలో కనిపిస్తున్న ఫోటోలు మరియు వీడియోలు ప్రస్తుతం నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.ఆ మిస్టరీ గర్ల్ ఎవరు అనేది ప్రారంభంలో ఎవరికీ తెలియక పోయినా, సోషల్ మీడియా యూజర్లు మాత్రం వెంటనే ఆరా తీసి ఆమెను ప్రముఖ సింగర్ విన్నీ తక్కెర్ గా గుర్తించారు. ఈ ఫొటోలు వైరల్ అయిన తర్వాత, విన్నీ తక్కెర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో లండన్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను షేర్ చేశారు. దీంతో ఈ ట్రిప్‌కు, ఆర్యన్ ఖాన్ కనిపించడానికి ముడిపెట్టి నెటిజన్లు రకరకాల చర్చలు ప్రారంభించారు. ఆర్యన్ ఖాన్, విన్నీ తక్కెర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరస్పరం ఫాలో అవుతుండటం, వారికి కామన్ ఫ్రెండ్స్ కూడా ఉండటంతో ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. అయితే ఈ రూమర్స్‌పై వీరిద్దరూ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.మరోవైపు విన్నీ తక్కెర్ ఎవరు అనే విషయానికి వస్తే ఆమె ఒక సింగర్-సాంగ్‌రైటర్. 'షైనింగ్ లైట్స్' 'మేబీ ఐ లవ్ యూ' 'ట్రో మిగ్'వంటి పలు ఒరి జిన ల్ సాంగ్స్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. స్పాటిఫై వంటి మ్యూజిక్ ప్లాట్‌ఫారమ్‌లలోఉన్నాయి.

Printed by Published by Derangula Rani on behalf of Derangula Rani, printed at and published at 45-238/3, Srinivas Nagar, Jagathgirigutta, Qutubullapur editor Derangula Rani.VASISTA PRINTERS18-97, #306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, RANGAREDDY, TELANGANA - 500060 TGTEL/25/A4111